# గిరిజన సంస్కృతి - కళలు - సాహిత్యం


| | |
|---|---|
| గణరాజ్యాలు - రాజ్యాలు : | 1 |
| మన్నెకొట్టాలు - బోయకొట్టాలు - పితూరీలు : | 1 |
| అనుసూచిత ప్రాంతం - తెగలు : | 2 |
| మార్గ - దేశి - గిరిజన సంప్రదాయాలు : | 3 |
| సంచార తెగల వృత్తులు - కళలు - ఆటపాటలు : | 3 |
| కొండకోనల్లో ఆటపాటలు - వాయిద్యాలు - కట్టుబొట్టు : | 4 |
| వ్యవస్థ - వివక్ష : | 5 |
| అడవులు, లోయలు, బయళ్ళలో జీవనవిధానాలు : | 6 |
| నల్లమలఅడవులు : | 6 |
| గోదావరిలోయలు : | 8 |
| విశాఖబయళ్లు : | 11 |
| తెలుగు సంస్కృతిలో గిరిజనుల భూమిక : | 19 |
| సంప్రదాయం - తిరుగుబాటు : గుణపాఠాలు : | 20 |
| వనరులు - విజ్ఞానం - హక్కులు : | 21 |
| చదవదగిన పుస్తకాలు : | 22 |

# గిరిజన సంస్కృతి – కళలు – సాహిత్యం

**గణరాజ్యాలు: రాజ్యాలు :**

భారతదేశంలోని తూర్పు పశ్చిమకనుమలు, మధ్యభారతంలోని వింధ్య సాత్పూరా ఆరావళిపర్వత ప్రాంతాలు, వాయవ్యసరిహద్దు ప్రాంతాల గణరాజ్యాలలో గిరిజనతెగలు వస్తుమార్పిడి, ఉమ్మడి కట్టుబాట్లతో తమవ్యవహారాలను చక్కబెట్టు కుంటుండగా; దిగువ ప్రాంతాలలో, తీరప్రాంతాలలోగల రాజ్యాలు కోశం, సైన్యంతో పరిపాలన సాగిస్తుండేవి. గణరాజ్యాలలో కొందరు నాయకులు రాజులుగా ఎదిగారు రాజ్యాలతో సంబంధబాంధవ్యాలను పెంచుకున్నారు. ఆరావళిపర్వతాలలో భిల్లులు, మధ్యభారతంలో గోండులు, తూర్పుకనుమలలో నందపురం రాజధానిగా పాలించిన రాజవంశాలు, మహేంద్ర పర్వతప్రాంతంలోని సవరలు (శబరులు) కాకతీయ సామ్రాజ్యాన్ని పునరుద్ధరించిన కోయనాయకుడు సీతాపతిరాజు / శితాబ్‌ఖాన్ చరిత్రలో పేరుపొందారు. రాజ్యాలు, గణరాజ్యాలమధ్య సంబంధాలు భారతదేశరాజకీయాలను మలుపుతిప్పిన సందర్భాలుఅనేకం. ఉదా॥ మౌర్యచంద్రగుప్తుడు చక్రవర్తికావడానికి పర్వతరాజు సహకరించాడు. భిల్లులు రాజపుత్రవీరుడు రాణా ప్రతాప్‌కు అండగా నిలబడ్డారు. స్థానిక తెగలసహకారంతో నాటిపాలకులనెదిరించి ఛత్రపతిశివాజి సహ్యాద్రిలోని కోటలమీద పట్టు సాధించాడు. గోండురాణి దుర్గావతి మొగలులనెదిరించింది.

**రాజనీతి :**

గిరిజనులు పుట్టుకనుండి ధనుర్ధరులు. సామ్రాజ్యాలు నిర్మించే చక్రవర్తులకు వారిని మిత్రులుగా చేసుకోవడం తప్పనిసరి. కాకతీయులు నేటి చత్తీస్‌గడ్ రాష్ట్రంలోని బస్తరును సామంతరాజ్యంగా చేసుకొన్నారు. గజపతుల తరపున సీతాపతిరాజు కళింగదండయాత్రలో పురోగమిస్తున్న శ్రీకృష్ణదేవరాయలను ఏలూరులో ఎదిరించి వీరమరణం పొందారు. నల్లమలల అంచున ఉన్న పల్నాటి సీమలో కొన్ని గిరిదుర్గాలు చెంచుల నాయకత్వంలో ఉండేవి. తీరాంధ్రంలోగల బోయకొట్టాలను పండరంగడు జయించినట్లు తొలితెలుగు శాసనం తెలియజేస్తుంది.

క. ధరణి నసాధ్యనగాటవు – లిరవుగ భూపీడసేయు నెరుకల పొరుగూ

ళ్లిరవగు నస్థితి శూరుల – కెరువుగ నిచ్చునది … … … … …

(ఆముక్తమాల్యద. 4వ ఆశ్వాసము. 223 – 225)

ముందుముందు తనకు ఎసరుపెడతారనుకున్నవారిని ఈ అడవులకు రాజులనుచేస్తే, అటు ఆటవికులను అదుపులోపెట్టినట్లు. ఇతరుల పెత్తనానికితలవంచని ఆటవికులతో సతమతమౌతూ శత్రురాజు చెలరేగకుండగ చూసుకున్నట్లు – ఇది శ్రీకృష్ణ దేవరాయలు చెప్పిన రాజనీతి. మృగయావిహారంద్వారా, గిరిజనులు ఎందరో యువరాజులకు యుద్ధవిద్యలలో శిక్షణనిచ్చారు. ఈ అడవులు ఎందరో పరాజితులకు ఆశ్రయమిచ్చాయి.

స్నిగ్ధమనోహరమైన మృగనయనివంటి అడవి పడుచులెందరో పాలకుల మనసు దోచుకున్నారు. పరాక్రమశాలియై గిరిజనవనిత శంకరమ్మ, రాజా సదాశివరెడ్డి అంగరక్షకురాలుగా ప్రవేశించి, రాణిగా అతనితో అర్ధసింహాసనం పంచుకొంది.

రాజమహేంద్రవరం రెడ్డిరాజ్యం పతనమైనతరువాత కొందరు సైనికులు పాపికొండలలో తలదాచుకున్నారు. అక్కడి స్థానిక తెగలతో బంధుత్వం కలుపుకున్నారు. పాలకవర్గంగామారారు. ఆ కుటుంబాలలో ఒకటి " పన్నెండు ముఠా (10 – 15 గ్రామాలు)లకు నల్లగవర్నర్లు 'పల్లాల' వారు" అని నానుడి. కాలక్రమేణ వారందరినీ 'కొండరెడ్లు'గా పిలువసాగారు. గోండులు తమ ఆధిపత్యం కొనసాగిన కాలంలో కొన్నిస్థానిక తెగలను తమలో కలుపుకున్నట్లు కనిపిస్తుంది. రాజగోండు, ధుర్వాగోండు, మరియాగోండు వగైరా ఉపతెగలు; వారి మధ్య తారతమ్యం ఈవిషయాన్ని ధృవపరుస్తాయి.

**మన్నెకొట్టాలు – బోయకొట్టాలు – పితూరీలు :**

ఆంధ్రప్రదేశ్‌లో అటవీప్రాంతాలను మన్నెకొట్టాలుగా, తీరప్రాంతాలను వాటికి దగ్గరలోని మెట్టప్రాంతాలను బోయకొట్టాలుగా పిలుచుకునేవారు. ఆంధ్రదేశంలో చిన్నచిన్న జమీందారులుకూడా 'మన్నెసుల్తాను'లే. 'చెంచుమలచూరకార' 'కూటువ మన్నె కుమాళ్ళ గుండెదిగుల' అని నాటిపాలకుల బిరుదులు. అడవులలో తలదాచుకున్న రాజులసైన్యంతోపాటు తీరప్రాంతాలలో, మెట్టలలో స్థిరపడ్డవారే యానాదులు, బోయలు. రాజులదండయాత్రకు ముందుగా బోయలు ఆ దారిలోగల ఊళ్ళుదోచుకుంటూ వెళ్ళేవారు. తరువాత సైన్యం నిరాటంకంగా ముందుకు సాగిపోయేది. దోచుకున్న ధనంలో బోయలు రాజులకు చెల్లించే వాటా లేదా పన్ను 'బోయసుంకం'. రాజమహేంద్రవరంలోగల నిజాం ఫౌజ్‌దార్‌తో 1734లో అక్కడి పాలకులు తలపడినప్పుడు బోయఫౌజ్, అత్యంతసాహసంతో శత్రుసైన్యంలోకిచొచ్చుకుపోయి, ఫౌజ్‌దార్ అధిష్టించిన అంబారీ తాళ్ళనుతెంచి, అతడిని కిందపడవేసింది. వాగినగిరి తరువాత శూరపురం రాజధానిగా పాలించిన బోయనాయకుడు బీజపూర్ గోల్‌కొండరాజులతో కలసి ఔరంగజేబునెదిరించాడు. బోయప్రభువు రాజభాహిరి పరమానాయక్‌వంశంలో చివరి యువరాజు 1857లో జరిగిన స్వతంత్రసంగ్రామంలో తమతో తలపడినందుకు బ్రిటీష్‌వారు అతనిని రాయవెల్లూరు కారాగారంలో బంధించారు. ఈ అవమానం తట్టుకోలేక అతడు ఆత్మహత్యచేసుకున్నాడు. బ్రిటీష్‌వారితో చేతులుకలిపిన నిజాం అతనిరాజ్యాన్ని కబళించాడు. రంపపితూరీ, గూడెంపితూరీలు సుదీర్ఘకాలం గిరిజననాయకత్వంలో తూర్పుకనుమలలో జరిగిన తిరుగుబాట్లు (1798-1924). గూడెంపితూరీకి చివరిదశలో నాయకత్వం వహించిన (1922 - 24) గిరిజనేతరుడు అల్లూరి సీతారామరాజు ధన్యుడైనాడు.

**అనుసూచిత ప్రాంతం** (Schduled area) **తెగలు** (Schduled Tribes) :

స్వాభిమానం స్వతంత్రకాంక్షగల గిరిజనులప్రాంతాలలో వేలుపెట్టడానికి సాహసించిన బ్రిటీష్ ప్రభుత్వం ఎదురుదెబ్బలు తిన్నది. గణరాజ్యాల ప్రత్యేకతలను గుర్తిస్తూ వాటిని మెదట్లో అనుసూచిత (షెడ్యూల్డు) జిల్లాలుగా తరువాత అనుసూచిత ప్రాంతాలుగా గుర్తించింది. నిర్మల్‌లో రాంజీగోండ్, బాబీఝరిలో కొమరం భీం నిజాంప్రభుత్వంమీద తిరుగుబాటు చేశారు. హైద్రాబాద్‌రాష్ట్రంలో గిరిజనప్రాంతాలను (నోటిఫైడ్ ఏరియా) 1946లో గుర్తించారు. నిజాంపనుపున పాశ్చాత్య మానవశాస్త్రవేత్త హెమన్‌డార్ఫ్ చెంచులు, రాజగోండ్లు, కొండరెడ్లను అధ్యయనం చేశారు. ప్రభుత్వానికి గిరిజనాభివృద్ధి సలహాదారుగా పనిచేశారు. అభివృద్ధిపేరిట గిరిజనప్రాంతాలలోకి వలసలను నాటిప్రభుత్వాలు ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రోత్సహించాయి. ఇలా వలసవచ్చినవారు గిరిజనులను దోచుకోకుండా చట్టాలు చేయసాగారు. ఆదివాసీతెగలను గుర్తించడానికి కొన్ని మార్గదర్శకసూత్రాలను ఏర్పరిచింది. భారత రాజ్యాంగం ఐదు, ఆరు అధికరణాలలో గిరిజనప్రాంతాలను పరిపాలించే విధివిధానాలను నిర్దేశించింది. 1917నుండి గుర్తింపు పొందుతున్న తెగల జాబితాపెరుగుతూ వస్తుంది. కొండప్రాంతాలకు వలసవెళ్లి స్థిరపడిన కొన్నిజాతులు తెగలుగా చెలామణి అవుతున్నారు. మైదానప్రాంతాలలోకూడా కొన్నిజాతులు తెగలుగా గుర్తింపు పొందాయి. ఇంకాచాలా జాతులు తెగలుగా గుర్తింపు కోరుతున్నారు. తెగలలోగల వైవిధ్యాలను గమనించిన భారతప్రభుత్వం కొండకోనలలోగల కొన్నితెగలను ఆదిమజాతులుగా (ప్రిమిటివ్ ట్రైబల్ గ్రూప్స్) పేర్కొన్నది.

దక్షిణ భారతంలో ఆంధ్రప్రదేశ్‌లోనే గిరిజనుల జనాభా అధికం. మనరాష్ట్రంలో 35 తెగలను ప్రభుత్వం గుర్తించింది. వీరిలో చెంచు, కొండరెడ్డి, కొలాం, సవర, గదబ, పొర్జా, ఖోండ్, తోటి. ఆదిమజాతులు.

**జిల్లాలవారీగా తెగల వ్యాప్తి :**

| | |
|---|---|
| 1. శ్రీకాకుళం: | సవర, జాతవు, గదబ ఖోండ్ (కోందు / కోదు / సామంత) |
| 2. విజయనగరం: | సవర, జాతవు, గదబ, ఖోండ్ |
| 3. విశాఖపట్నం: | భగత, గదబ, కమ్మర, కొండదొర, కోటియ, ఖోండ్, మాలి, మన్నెదొర, |
| | ముఖదొర, రెడ్డిదొర, పొర్జా, వాల్మీకి, గౌడ, కులి, ధూళియ, పైకో, పుటియా |
| 4. తూర్పుగోదావరి: | కోయ, కొండరెడ్డి, కమ్మర, కొండదొర |
| 5. పశ్చిమగోదావరి: | కోయ, కొండరెడ్డి |
| 6. ఖమ్మం: | కోయ, కొండరెడ్డి, సుగాలి లేదా లంబాడి |
| 7. వరంగల్: | కోయ, లంబాడి |

8. ఆదిలాబాద్: గోండ్, కోలం, పర్ధాన్, తోటి, లంబాడి, నాయక్‌పోడ్, అంధ్

9. మహబూబ్‌నగర్: లంబాడి, చెంచు

10. ప్రకాశం, కర్నూలు, నెల్లూరు, గుంటూరు: చెంచు, లంబాడి, నక్కల, మొండిబండ, కుర్వికరన్, యానాది, యెరుకల

ఈ ముప్పైఐదు తెగల మొత్తంజనాభా 50,24,104, తెలుగు మాతృభాషగలవారు కొండరెడ్లు 83,096, బగతలు 1,33,434, కొండదొరలు 206381, రెడ్డిదొర 1721, ముఖదొర 37983, వాల్మీకులు 66814, కొండకమ్మరులు 45010, చెంచులు 49232, యానాదులు 462167, కొండకాపు 11780.

## మార్గ, దేశి, గిరిజన సంప్రదాయాలు :

రాజులమధ్యనే కాదు, కొండకోనలలోగల గిరిజనుల దేవతలను మన్నిస్తూ తమదేవతలకు వారిదేవతలకు వియ్యం కలుపుతూ నాటి దార్శనికులు జాతుల సమైక్యతకు ఒరవడి దిద్దారు. దుర్గవింధ్యాచలవాసిని. సప్తమాడెములు సప్తమాతృకలకు ఆవాసాలు. చక్రకోట్యం (బస్తర్) భ్రమరకోట్యం, మాణిక్‌ఫుర్, మాహూర్, చక్కెర, భ్రామరీ, మాహురీ దేవతలకు ఆలవాలాలు. లంకను జయించి అయోధ్యకు తిరిగి వస్తున్న శ్రీరాముడు తమిళుల ఆడపడుచు గోదాదేవిని పెండ్లాడినట్లే, నరసింహస్వామి చెంచులక్ష్మి ప్రణయం ఆంధ్రదేశంలో నరసింహ సంప్రదాయాన్ని వ్యాపింపచేసింది. గరుడాచల యక్షగానం పండితులదైతే, నక్కల యానాదుల భాగోతం పామరులది. శ్రీశైలం మల్లన్న చెంచుల బావ. భ్రమరాంబవారి ఆడపడుచు ఆంధ్రదేశంమధ్యలోగల నల్లమల అడవులమీద ఆధిపత్యం, శాంతి భద్రతలతో పరిపాలన జరపడానికి నాడు తప్పనిసరి. అందువలన రాజకీయంగానేకాక సాంస్కృతికంగాకూడా నాటిసమాజం చెంచులకు ప్రాధాన్యతను ఇచ్చి గౌరవించింది. కానిఅనంతపురం జిల్లా పెన్నఅహోబిలంలో చెంచులక్ష్మికళ్యాణం బసివిసంప్రదాయంలో భాగంకావడం విచారకరం.

భారతీయ సాంస్కృతిక వారసత్వం మార్గ, దేశి, గిరిజన సంప్రదాయాల త్రివేణీ సంగమం. మార్గ సంప్రదాయం వేదశాస్త్రాలు, పురాణాలు ఆధారంగా వర్ధిల్లింది. గ్రామీణులది దేశిసంప్రదాయం. గిరిజన సంప్రదాయం గ్రామాలకు నగరాలకు దూరంగా కొండల్లో అడవుల్లో తమ ప్రాంతంలో వనరులబట్టి వికసించి ప్రాంతీయతను నిలుపుకుంటుంది. మార్గదేశి సంప్రదాయాల్లో అంతర్వాహినిగా కొనసాగుతుంది.

## సంచార తెగల వృత్తులు – కళలు – ఆటపాటలు :

చుట్టుపక్క సంస్కృతుల ప్రభావం కొండకోనల్లోకి సోకినప్పటికీ అదితాత్కాలికమే. నగరాలలో రాజ్యాలలోగల సంస్కృతికి కొంతతలవంచినప్పటికీ – దిగువ ప్రాంతాలలో సంచారజాతులు కొంతవరకు తమసంస్కృతిని నిలుపుకున్నాయి. ఈ తెగలు సంస్కృతిలోనేకాదు భాషలలోకూడా ప్రత్యేకమైనవే. భారతదేశంలో ప్రధాన భాషలు పదులసంఖ్యలో వుండగా – గిరిజనులభాషలు వందలసంఖ్యలో ఉన్నాయి.

1. కుర్వికారన్, 2. కుంకుం దాసరి, 3. గంధోళి, 4. మొండిబండ, 5. మందుల, 6. బుక్కదాసరి, 7. పూసల, 8.ముష్టిచెంచు, 9. గుడ్డెలుగుల మొదలైనతెగలంతా సంచారజీవులు. కొందరు గాడిదలు, గుఱ్ఱాలమీద తమసామగ్రి తరలిస్తుంటారు. చెట్టుమందులు, అలంకారసామగ్రి, సుంగంధద్రవ్యాలువగైరాలు అమ్ముకుంటూ తిరిగే వీరిలక్షణాలు ఒక్కటే; ఆరుబయట మకాం ఏర్పాటు చేసుకునిస్వేచ్ఛగా జీవించడం, సంచారజీవులైనప్పటికీ కులకట్టుబాట్లు పాటించటం.

సాధారణంగా తమసరిహద్దులు కులపంచాయితీలలో నిర్ణయించుకుంటారు. తెలుగుసీమ ఇతర రాష్ట్రాలలోవున్న తెలుగువారి దగ్గరకుకూడా పోతూవుంటారు. కొందరు ఆయా భాషలుతెలిసినవారు ఆ ప్రాంతాలకు పోతూవుంటారు. అందరూ పండుగల రోజులలో దిగి దండుకుంటారు, వాటాలు పంచుకుంటారు. వీళ్ళంతా ముష్టివాళ్ళుకాదు. ఒక్కోతెగ ఒకపనిలో తరతరాలుగా నైపుణ్యం సంపాదించుకుని ఒక్కోప్రాంతమంతా సేవలందిస్తూ జీవితం గడుపుతుంటారు. వీరిరాకతో గ్రామం కొత్త సరదాల్లో మెరిసిపోతుంటుంది. ఆయాఅవసరాలుకలవారు వీరిచ్చే మందూమాకుల, అలంకారాల, వినోదాల కోసం ఎదురుచూస్తుంటారు. తమ ఆటపాటలతో అందచందాలతో జనంలో తిమ్మిరి వదిలిస్తారు. వీరిలో కొందరు విముక్తజాతులకు(డినోటిఫైడ్) చెందినవారు.

జక్కుల, పగటి వేషగాళ్ళు, ఎరుకల, యానాది భాగోతులు; వీళ్ళుతమ విచిత్రమైన వేషాలతో, అభినయంతో, సంగీతంతో తెలుగుదేశంలో యక్షగానాలకు కూచిపూడివంటి భాగవతాలకు, తర్వాత వెలసిన సర్కస్ విన్యాసాలకు పునాదులువేశారు. ఈ తెగలు, వారిఆటపాటల నేర్పు, నటనలగూర్చి ప్రాచీనకావ్యాలన్నీ పేర్కొన్నాయి.

**కొండకోనల్లో ఆటపాటలు :**

పెన్‌గంగ – ప్రాణహిత నదీతీరాలలో నివసించే రాజగోండ్లకు తృణధాన్యాలు – మొక్కజొన్న పంటలు చేతికందే దీపావళిలో పండుగలు ప్రారంభమౌతాయి. ఒక నెలపాటుసాగే ఈ పండుగల్లో ఆడుతూపాడుతూ తిరిగే యువతీయువతులను గ్రామస్థులు మర్యాదచేస్తారు. వారివీరులు, దండరియా రౌర్, సిపెపెర్మారౌర్ అనే వారి వీరులపేరిట ఈ ఆటలకు 'దండారి' అనేపేరువచ్చింది. 'గుమెల' దరువుకు అనువుగా కోలాటంవేస్తూ గుండ్రంగాచేరి దేవతలను ఆహ్వానించి వారిపాదాల దగ్గర కోలలుంచి చప్పట్లుకొడుతూ పాటలుపాడతారు. ఒకవరుసఆటగాళ్ళు పదంపూర్తిచేయగానే, ఇంకోవరుసవాళ్ళు అందుకుని పూర్తిచేస్తారు.

దండారిఆట మంచిజోరులో ఉండగా, నలుగైదుగురు 'గుసాడి'లు హటాత్తుగా ఆటలో ప్రవేశిస్తారు. నెమలిఈకల కిరీటం, అంటించుకున్న మీసాలు, గడ్డాలు, మేకతోలు చొక్కాలు, వాటిమీద నత్తగుల్లలు, గవ్వలు, గంటలు, బెండుముక్కలదండలు, చేతిలో దుడ్డుకర్రలతో వీరి వేషం చాలా ఆశ్చర్యకరంగా ఉంటుంది. గుసాడిలు ప్రవేశించగానే దండారిలు ప్రక్కకు తప్పుకుంటారు. గుసాడిలు వళ్ళంతా ఊపుతూ ఆడుతుంటే – వాయిద్యాలు మోగుతుంటేవారు వేసుకున్న గుల్లలు, గవ్వలు, గంటలు, బెండ్లు లయాన్వితంగా చప్పుడు చేస్తుంటాయి.

**కొండరెడ్ల ఆటపాటలు :** "లేలేలేల లేలలమ్మారో ఓలేలేలలేల" పల్లవితో పండుగపాటలు, "అచ్చుకోడ లయ్యోకోడ లాలచ్చీరి బాలకోడలా" పల్లవితో పెండ్లిపాటలు మొదలవుతాయి. "ఆడవాలె పాడవాలె – వేడుకలు చెయ్యవాలె" ఇది తరచూ వినవచ్చే పిల్లపల్లవి. సపిరెలు, గుమ్మళ్లు, నందాలాటలు వారిఆటలు. పిల్లగుమ్మళ్లు, శివాలుగుమ్మళ్లు, జోగుగుమ్మళ్లు, బారుగుమ్మళ్లు, చుట్టుగుమ్మళ్లు, తీయగుమ్మళ్లు గుమ్మలాటలలో రకాలు. ఈ గుమ్మలాటలను అనుసరించే డోలగతులు. "పండికదండలు – తప్పితెగరగలు – పాతకోటభరతం – దెబ్బలగూటం – కరిణికదెబ్బలు – పనుముకుజంపం".

కోయలపండుగలలో ఉత్సాహవంతమైనది మార్చి – ఏప్రిల్ నెలల్లోచేసే భూదేవిపండుగ. ఈ పండుగ చేసేటప్పుడు మగవారు వేటకు వెళ్ళాలి. వేటతెచ్చిన మగవారు కొమ్ములతలపాగాలు పెట్టుకొని డోళ్ళు మోగిస్తూ ఊళ్ళోకివస్తారు. ఆడవారు గంగాలమ్మ, ముత్యాలమ్మ దేవతలమీద పాటలు పాడతారు. ఈ పాటలో 'రేల' పదం పల్లవి. రెల్లచెట్టుకింద తమ పూర్వులు పుట్టారని కోయల ఇతిహాసం. వేసవిలో పచ్చగా పూసే రెల్లచెట్లు అడవంతా అందాన్ని నింపుతాయి. గంగాలమ్మపండుగ చేసేవరకు కోయలు, కొండరెడ్లు ఈ రెల్లపూలను తెంపరు. పెరంకోక ఆటలో – పెరంకోక అంటే అడవిగేదె(గురగేదె). కోయలలో మగవారు అడవిదున్నకొమ్ములతో చేసిన తలపాగా ధరించి – వాటిలాగే భయంకరంగా తలపడతారు. కోయలు, కొండరెడ్ల ఆవాసమైన పాపికొండలు 'బైసన్‌హిల్స్'గా పేరుపొందాయి.

**నెమలి ఆట :**

వేసవికాలంలో వచ్చే ఇటిం పండుగలో – పెళ్ళిళ్ళలో కోందులు లేదా సామంతులు ఆడేది నెమలి ఆట. పిల్లనగోవి పాటకు జతగా (పరోడి) కాళ్ళకు గజ్జెలుకట్టుకుని ఆడతారు. తలకు రంగురంగుల చింకుగుడ్డల 'తొయ్యంగా' పాగాచుట్టు కుంటారు. నడుముకు నెమలి ఈకలతోక (మెల్కముతంగా) కట్టుకుని నెమలిలాగా ఆడతారు. తల్లిభూదేవత – తండ్రి ఆకాశాన్ని ప్రార్థిస్తూ ఈ పాటలు ఆటలు మొదలౌతాయి. కుడిచేతిని నోటికడ్డంగా పెట్టుకొని నెమలిలాగా అరుస్తూ గోలచేస్తారు. ఇక పెళ్ళికూతురు ఇంటిముందు దృశ్యం. పిల్లను ఇమ్మని బతిమాలి బామాలి – పిల్ల ఇంటివాళ్ళు ఒప్పుకోకపోతే పెళ్ళికొడుకు తలకిందులుగా నిలబడి మొత్తుకొంటాడు. పిల్లాడి తరుపువారంతా సానుభూతితో గంతులు వేస్తూంటారు. చివరకు పిల్లవాడి బాధలు చూసి పిల్లవచ్చి వాడి కాళ్ళుదింపి, పెళ్ళికి అంగీకరిస్తున్నట్లు తెలుపుతుంది. చివరకు చేతిలోరుమాళ్ళు ఎగరేస్తూ ఆటఆడుతూ పిల్లను పిల్లాడిఇంటికి తీసుకుపోతారు. దీన్ని నిలాస్వ్ అంటారు.

**ధిమ్సా నృత్యం :**

మాచ్‌ఖండ్ గోస్తనినదీతీరాల్లో గిరిజనుల ధిమ్సానృత్యం చాలా ప్రచారంపొందింది. ప్రతిపండుగలో ఇదిముఖ్యం. చైత్రంలో ఇది తప్పనిసరి. మోరి, కిరిడి, తుడుం, డప్పు వాయిద్యాల మధ్య ఉత్సాహపరచడానికి కొమ్ముబూరమోతలు (జోడుకొమ్ములు), రకరకాల వరుసలలో, గుండేరి, గొడ్డబెట్టు, పోతర్ – తోల మొ॥ ఆటలుసాగుతాయి.

1) గుండేరి; గుండేరి అంటే స్త్రీ మగవాళ్ళు ఆటప్రారంభించి ఆడవారిని ఆహ్వానిస్తారు. అందువల్ల దీనికి గుండేరి అనిపేరు. ఒయిసాగుండేరి, బారుగుండేరి, చుట్టుగుండేరి మొదలైనవి గుండేరిలో రకాలు.

2) గొడ్డిబెట్ట అంటే రాళ్ళేరడం; పోడు భూములలో రాళ్ళురప్పలు ఏరుతున్నట్లు ఉంటుంది.

3) పోతర్ – తోల; అంటే ఆకులు కోయడం. ఆడ్డాకులు పోగుచేయడం ఇక్కడ గిరిజనుల జీవనాధారాల్లో ఒకటి.

4) బోడో : ఈ ఆటలో నిశాని – చోడి దేవతలను ఆహ్వానించివారి దీవెనలు కోరతారు. ఇది అన్నిఆటలకు ముందుగా అన్నివాయిద్యాల జతలో ఆడేఆట.

**వాయిద్యాలు :**

గిరిజనులువాడే వాయిద్యాలు 1) తీగలవి 2) గాలితో మోగించేవి 3) వత్తి కొట్టి మోగించేవి. 4) తీగలతో మోగేవి.

1. కింగిరి: ప్రధానుల ముఖ్యవాయిద్యం. మూడుతీగలు, ధ్వని ప్రకంపనానికి తోలుతో బిగించిన చక్క, మువ్వలు కూర్చిన విల్లుతో తీగలను మీటుతారు. పెద్దలు కింగిరి వాయిస్తుంటే పిన్నలు తప్పెటలు మోగిస్తారు.
2. మోమోరంజన్ : 16–20 అంగుళాల వెదురుకు గుమ్మడికాయను మైనంతో అతికిస్తారు. సవరలకిన్నెర నేటి గిటారుకు మాతృక.
3. గోగోడ్‌రాజన్: ఇది సవరల వాయిద్యం. కొబ్బరి చిప్పను 'సౌండ్‌బాక్స్'గా చేసి దాన్ని ఉడుముతోలుతో మూస్తారు. దీనికి 12–16 అంగుళాల వెదురును మేకుతో కొడతారు. రెండుతీగలను అమరుస్తారు. దీన్ని విల్లుతో మీటుతారు.
4. నాగస్వరం: స్వరనాడి – శ్రుతినాడి గుమ్మడికాయలో ఇమిడ్చారు. ఈ వాయిద్యం గ్రామప్రజలపై చూపించే సమ్మోహన శక్తి అద్భుతం.
5. జోడుకొమ్ములు: ఇవి కొమ్ముబూరలు.
6. పిల్లంగ్రోవి: ఇదిరకరకాలు. కొలాం, చెంచు, సవరలు పిల్లంగ్రోవివాయిస్తారు.
7. డిరెన్ – బోంబ్ – పెడెమ్: ఇది 12–16 అంగుళాల గేదెకొమ్ము చివరన 6–8 అంగుళాల పీక దూరుస్తారు.
8. సవరసన్నాయి: ఇది చిన్నసన్నాయి 12–15 అంగుళాల పొడుగుగల కర్రనుతొలిచి నాలుగైదు రంధ్రాలుచేస్తారు. ఇది షెహనాయిలా మోగుతుంది. షెహనాయికి ఇది మాతృక కావచ్చు.

**కట్టు – బొట్టు :**

కోందులు అవయవసౌష్టవం కలవారు. కట్టుబట్ట వారిది ప్రత్యేకం. మగవారు గోచీపెట్టు కుంటారు. ఆడవారు చీరెను మోకాళ్ళు తాకేటట్లు కట్టుకొని రెండు చెంగులు ముడివేస్తారు. మరో చీర ఎడమచంక కిందగా రెండుభుజాలను కలుపుతూ రొమ్ములను బిగిస్తుంది.

తోటీలు పరధానులవలెనే కొన్ని గోండుకుంటుంబాల గాథలు పాడుతూ – వాద్యగాళ్ళుగా జీవనం సాగిస్తారు. కానిపరధానులకు వీరికి రూపు రేఖలలోనేకాదు, వృత్తులలో, భాషలో తేడాఉంది. తోటీలు వనమూలికలు సేకరించి అమ్ముతారు. తోటిమహిళలు పచ్చబొట్టుపొడుస్తారు. వాళ్ళ భుజాలు, గుండె, ముఖంమీద ఎన్నోరకాల అందమైన పచ్చబొట్లతో ముచ్చటగొలుపుతారు.

తెలుగునేలమీద చాలాకాలంగా ఉన్న సుగాలీలు తమభాష, కట్టు బొట్టు ఆచారవ్యవహారాలు నిలబెట్టుకున్నారు. లంబాడీలు, అద్దాలతో కుట్టిన ముదురురంగు లంగాలు వేసుకుంటారు, రొమ్ములమీద 'ఫడ్కీ'ని వీపువెనక్కు తాళ్ళలోముడివేస్తారు. తలమీదుగా అద్దాలపూసల పనితనంచేసిన చోళీకప్పుకుంటారు. మెడలో 'హస్లీ' (కంటె), కాళ్ళకు గజ్జెలతో చాలాచప్పుడుచేస్తూ నడుస్తారు. హోలీ శీతల, తీజ్, తుల్జాభవానీ వారిముఖ్యమైన పండుగలు.

విజయనగరంజిల్లాలోని సాలూరుప్రక్కన విశాఖజిల్లాలోని అరకుప్రాంతాల్లో గదబస్త్రీల చీరకట్టు విశిష్టమైనది. వారి బట్టలువారే నేసుకుంటారు. పెద్ద చెవికమ్మలు పెట్టుకుంటారు – మెడలో రంగులపూసలు వేసుకుంటారు. కోయమహిళలు మూడురంగులచీరలు మోకాళ్ళవరకు కట్టుకుంటారు (గొట్టడి). వివిధవృత్తులు, కళలు, వేషభాషలవలెనే ఆయాప్రాంతాల వనరులమీద ఆధారపడిన జీవనవిధానాల్లోకూడా ప్రత్యేకత కనిపిస్తుంది.

## వ్యవస్థ – వివక్ష :

వ్యాప్తిలో, నాగరికత సంపర్కంలో తారతమ్యాలుగల తెగలలో ప్రత్యేకతలను సూత్రప్రాయంగా గమనిస్తేకాని కాలానుగుణంగా వస్తున్న పరిణామాలకు ఆదివాసులు స్పందిస్తున్న తీరుతెన్నులు మనకు బోధపడవు, అంతేకాదు, ఆదివాసుల వారసులమైన మనం ఎటునుంచి ఎటుపోతున్నామో అర్థంకాదు.

లిఖిత చరిత్ర (Preliterary) నగదు చలామణి (Premonetary) చరిత్ర (prehistoric) వీటి పూర్వదశకు చెందిన వారుగా మానవశాస్త్రవేత్తలు తెగలను నిర్వచిస్తారు. పల్లెప్రజల సంస్కృతిలో మార్గదేశి సంప్రదాయాలు బొమ్మ, బొరుసు వంటివి. రాజకీయమైన ఆటుపోట్లు, తరచు స్థానభ్రంశంవంటి ఉపద్రవాలు లేని గిరిజనసమాజాలకు మార్గదేశి సంప్రదాయాల పరిచయం తక్కువే. వనవాసులకు ఋతువులు తెలుసుగాని పంచాంగం లెక్కలమీద ఆధారపడిన కార్తెలు తెలియవు. జానపదులకు అక్షరజ్ఞానం తక్కువ, గిరిజనులలో అక్షరగంధమేలేదు. చక్కమందులు తప్ప రసాయనాలతో నిండిన ఆయుర్వేదంవారికి తెలియదు. అయితే అనాదిగా సాగుతున్న రాజకీయ సంబంధాలవల్ల దేశిసంప్రదాయాలు, సంస్కృతీకరణలు కొండప్రాంతాల పాలకవర్గాలలో చోటుచేసుకున్నాయి. వ్యవసాయం వ్యాపారంతోపాటు మాయలు, మోసాలు పెరుగుతున్నాయి. పాలకవర్గంతో సంబంధం కలవారు ఆవుమాంసం తినడం వదిలేశారు. ఆవుమాంసంతినే సాటితెగలను అస్పృశ్యులుగా చూడకపోయినప్పటికీ వారిమధ్య వివాహబంధాలను గిరిజనసమాజం అంగీకరించదు. దిగువప్రాంతాలనుండి వలసవచ్చిన ఆ వర్గాలవారిని దూరంగానే ఉంచుతారు. సంప్రదాయంలోగల ఈ అవలక్షణాలు ఎలావున్నా, నాగరికతతో సంపర్కం హెచ్చుగాగల తెగలే అవకాశాలను అందుకుని ముందుకు పోతున్నారు.

**వ్యవస్థలు**

| | | |
|---|---|---|
| తెగలు | జానపదులు | నాగరికులు |
| దేశిసంప్రదాయాలు | మార్గ, దేశిసంప్రదాయాలు | ప్రపంచీకరణ |
| వస్తుమార్పిడి | సంతలు | నాణేలు – బంగారం |
| అక్షరగంధం లేదు | అక్షరజ్ఞానం లేదు | రాతకోతలు – లావాదేవీలు |
| ఋతువులు | కార్తెలు (పంచాంగం) | కాలెండర్ |
| గణరాజ్యాలు(కులకట్టు) | రాజ్యం | పరిపాలన |
| తప్పు, వెలి | కారాగారశిక్ష | కారాగారశిక్ష |

**వర్ణవివక్ష**

| | |
|---|---|
| ఆవుమాంసం తినే జాతులు/తెగలు | ఆవుమాంసం వదిలేసిన జాతులు/తెగలు |
| అపవిత్రులు (అంటరానివారు) | పవిత్రులు |
| పాలితులు | పాలకులు |
| ఊరిపొలిమేర అవతలదేవతలు | గ్రామదేవతలు |
| వర్ణసంకరానికి శిక్ష : వెలి | తప్పు |

## అడవులు, లోయలు, బయళ్ళలో జీవనవిధానాలు :

### నల్లమలఅడవులు :

ఆంధ్రప్రదేశ్ మధ్యలో సరులు, కురువలు, కట్టువలు, సారవలు, బరకలతో నిండిన నల్లమలలు గడ్డిమైదానాలతో నిండిన 'చిట్టడవులు'. అతితక్కువ వర్షపాతం. రాతినేలలను లోతుగా తొలుస్తూ ప్రవహించే కృష్ణవేణిని ఇక్కడ "పాతాళగంగ"గా పిలుస్తారు.

సరులుదిగి, కురవలుఎక్కి, కట్టువలుదాటి శ్రీశైలం వెళ్ళే యాత్రికులు అలసి సొలసి చేదుకో మల్లయ్య అనిఘోషిస్తుంటారు. ప్రకాశంజిల్లా ఎరగొండపాలెం మండలం పాలంక వీరన్నను దర్శించే భక్తులకు 'గుట్టలచేను కురువ – గుండెల్లో గస' అనుభవమే వేట అటవీఫలసాయం సేకరించుకునే చెంచులకు వ్యవసాయంలో అనుభవంలేదు. ప్రభుత్వ ప్రోత్సాహంతో వ్యవసాయం చేపట్టినవారు, ఇంకా రైతులుగా నిలదొక్కుకోలేక అడవి మీదనే చాలావరకు ఆధారపడివున్నారు. నల్లమలలోకి

గత ముప్ఫై, నలభైఏళ్ళుగా సుగాలీలు, రైతులవలసలు వారివ్యవసాయం పెరిగాయి.

చెంచులవి "చుట్టు గుడిసెలు". ఆలుమగలు కుక్కలనువెంటేసుకుని "పొలం" పోతారు. "పొలం" అంటే వారిమాండలికంలో అడవి. బుడగ జంగాలుకూడా చుట్టుపక్కల అడవిలోకి పోయేటప్పుడు "పొలంలోకి పోతున్నాం" అంటారు. చెంచుల ఆవాసాలు "పెంటలు". ఈ పెంటల సరిహద్దులోగల వనరులన్నీ ఆపెంట చెంచులవి. ఈ సరిహద్దుల మధ్యప్రాంతాన్ని "మిరాశి" అంటారు. ఈ మిరాశీలోగల వనరులకువారి దేవతలు నల్లమల అంకమ్మ, బయన్న, ఒంటివీరుడు వగైరాదేవరలే రక్ష. తాము ముందుగా గుర్తించిన వనరులను వేరొకరు దొంగిలిస్తే ఈ దేవతల సాక్షిగా తగవు తీర్చుకుంటారు. మహిమాన్వితులైన తమ పూర్వులు "రావగాళ్ళ" ఏలుబడిలో నల్లమలవున్నట్లు చెంచులు భావిస్తారు. వారు "గజ్జెలకొండ రాకాసి"ని కొట్టడానికి తయారుచేసుకున్న "విల్లు" (ఇంద్రధనుస్సు), "రావగానిదబ్బ" (దబ్బ = విల్లు). నేదు(ముళ్ల)పందులు రావగాడి పెంపుడుజంతువులు. లాగబొక్కలు (గుహలు) రావగాడినివాసాలు. వాటిలోని నీటిగుంతలు రావగాడి జల్లిగుంటలు. ఒకరకం తొడిది (తేనెపెర) తాబేలుతీగ రావగాడివి కాబట్టివాటిని చెంచులుతినరు. తాముతినలేని, తమకు అందుబాటులోలేని వనరులను దేవతలకు కేటాయించటం మానవుల గడుసుతనం.


చెంచుల ఋతుచక్రం

తేనెలు – "కోరిందలు పూసేటప్పుడు కాటుతక్కువ (దీపావళి)
– ఏపెపూసేటప్పుడు ఉట్టి తట్టలే (శ్రావణం)
– ఎర్రబలుసు పగిలినప్పుడు కాటుఎక్కువ (తొలకరి)

గడ్డి – నేంద్రగడ్డిమీద అన్ని జంతువులు బలుస్తాయి
– చీడగడ్డిమీద ఉడుం బలుస్తాది
– ఏడుముండ్ల గడ్డిమీద కణితిపోతు బలుస్తాది"

ఉసిళ్ళు – "కానుగచెట్టు పూసినప్పుడు కాళ్ళువస్తాయి
– రేలచెట్టు పూసినప్పుడు రెక్కలు వస్తాయి
– ఏగిపూసినప్పుడు ఏగి బండలపై ఎగురుతాయి"

## <u>చెంచుల ప్రపంచం</u>



చెంచులవలె ఆహారసేకరణమీద ప్రధానంగా ఆధారపడే 75 ఆదిమజాతులు దేశంమొత్తంమీద వున్నారు. ఈ అడవుల్లో వారే మన మార్గదర్శకులు, భారతీయులలో అటవీ విజ్ఞానశాస్త్రవేత్తలు. కానీ వనరులమీద జనం వత్తిడి పెరిగి, అడవులు నశించడంతో, కొన్నిప్రాంతాలను వన్యప్రాణుల రక్షణ కోసం కాపాడే ప్రయత్నంలో ప్రభుత్వం అభయారణ్యాలుగా ప్రకటించింది. వాటిలోవున్న ఆదిమజాతులను తరలించే ప్రయత్నం చేస్తున్నది.

**గోదావరిలోయలు :**

దండకారణ్యంలోగల గోదావరిలోయల్లో వనాలు, వేనాలు (కొండవెన్ను), జవుకలు, లొద్దులు, గొందులు, తోములు, లంకలతో నిండిన "కారడవుల"లో ఆహారం సేకరించుకోవడంతోపాటు గిరిజనులంతా 'పోడు' వ్యవసాయం చేస్తుంటారు. అడవిని నరికి తగులబెట్టి ఒకేసారి అన్ని విత్తనాలుచల్లి వరుసగావచ్చే సామ, రాగి, జొన్న, బొబ్బర, కంది పంటలు పండిస్తారు. "కొండచేను కోమటివాడి దుకాణం"అని కొండరెడ్ల సామెత. అంటే అన్ని ఆహారపదార్థాలు అక్కడపండుతాయి. ఈ పంటలు, అటవీ ఫలసాయాన్ని అమ్మి తమకు కావలసిన వస్తువులు ఉప్పు, బట్టలు, ఇనుము, గిన్నెలు వగైరా కొనుక్కుంటారు. "కోదోడి పోడు – కోమటోడి సంచి"; ఉత్తరాంధ్రంలో ఈ నానుడి వస్తుమారకంలో కష్టనష్టాలను స్పష్టంగానే చెబుతుంది.

గ్రామమంతా ప్రతిపంటకూ పండుగచేసిన తరువాతనే తినడం మొదలుపెడతారు. ఈ పంటల పండుగలను "కొత్తలు కలపడం" అంటారు. పండుగకుముందు తప్పనిసరిఅయితే ఉడికించి మాత్రమేతినాలి. పండుగ తరువాత వేయించుకుని తింటారు. పండుగ తీరని గ్రామంవారు పండుగచేయని గ్రామంలో ఆపంటను తినకూడదు. వేయించడం అంటే ఒకసంస్కారం. ఇలా పంటలు తినడంమీద ఆంక్షలు "దేశవిడి" (సంక్రాంతి) నెలలో విడిపోతాయి.

దేశమంతా పండుగ తీరిపోతుంది కాబట్టి అది "దేశవిడి" పండుగ. పంట భాగ్యాలకు పాండవరాజులు అధిదేవతలు. వారు గిరిజనుల ఆదర్శమూర్తులు. భీముదువారి అభిమాన దేవత. అరగని నూలిదుంపలు భీముడిదుంపలు. పెద్దపెద్దవేనాలు భీముడివేనాలు, భీముడిపనుకులు, భీముడిలాగలు. పంటలన్నీవచ్చాక పాండవరాజులను గ్రామంలోకి ఆహ్వానిస్తూ పండుగ చేసుకుంటారు. ఈ పండుగ తరువాత అడవిలోకి వెళ్ళి ఫలసాయం తెచ్చుకోవడానికి అనుజ్ఞ కోరుతూ చేసేది అడవిరాజుల పండుగ. "పండుగ చేసిన తరువాత, అంకిలి అనుమానం లేకుండా అడవికిపోతాం, కూరతెచ్చుకుంటాం, నారతెచ్చుకుంటాం, దుంపకులపోతాం, తేనెలుతీస్తాం, చీపురువిరుస్తాం"అని గిరిజనుల వివరణ. అడవిరాజులు ప్రకృతికి, పాండవరాజులు సంస్కృతికి అధిదేవతలు. పచ్చిమాంసం రాజులకు, కాల్చినమాంసం పెద్దలకు నివేదిస్తారు.

క్రూరజంతువుల రూపంలో తమను బాధించవద్దని మొక్కుకునే రాజుల పండుగ తరువాత వచ్చేది "మామిడికొత్త". యాభై, అరవైఅడుగుల ఎత్తున 400, 500 సెంటీమీటర్ల కైవారంతో పెరిగే కొండమామిడిపండ్లు రాలే "దూలవిడికి మామిడి దులదులా రాలుతుంది" "పెద్దవిడికి మామిడి పేరు లేకుండా పోతుంది"అని వారికాలమానాల్లో ఈ నెలల వర్ణన. తెలతెలవారుతుండగా మామిడిపండ్లకోసం ఎలుగులు మనుషులు దాగుడు మూతలాడుతుంటారు. శాకాహార జంతువులను కాచేవారు "అడవిగొల్లలు". అడవి జంతువులు తినే పండ్లను ఈ "మామిడికొత్త"కుముందు తినవలసివస్తే తొక్కతో మాత్రమే తినాలి. ఈ మామిడిపండ్ల"కలి" (గుజ్జు)తో తాండ్ర పోసుకుంటారు. మామిడిముక్కలను "జన్నెలు" (వరుగులు) చేసుకుంటారు. టెంకలో జీళ్లను పాతర వేసుకుంటారు. ఆ జీళ్లను కుమ్మి బుట్టలోవేసి వగరుపోయేంతవరకు కాలువలోవుంచుతారు. ఆ టెంకపప్పుతో రొట్టె చేసుకుంటారు. అంబలి కాచుకుంటారు. "కుండన వండింది అంబలి – పెంకన వేపింది సురువులు". సురువులు మంచినంజకం. పడిపోయిన మామిడిచెట్టుమీద మొలిచే "కొక్కుల"(పుట్టగొడుగులు)తో కాచినచారు మంచిరుచి.

నవంబర్, డిసెంబర్ నెలలనుండి ఫిబ్రవరి చివరవరకు అడవులలో జీలుగచెట్లనుండి, దిగువన తాటిచెట్లనుండి కల్లువస్తుంది. ఈ కల్లుగీసేముందు చేసేది "చెట్టుపండుగ". కల్లుతోసహా అన్నినీటివనరులకు "కన్నెపాపలు" అధిదేవతలు. నీటిమడుగుమీద పరుగు పెట్టేది 'గన్నిక పురుగు (పాండ్‌స్కేటర్)'. కాలువఒడ్డున పెరిగేమొక్క 'కన్నెజీలుగు (ఫెరన్)', 'గన్నికచెట్టు'. చేప, కప్ప, ఎండ్రకాయ, తాబేలు జలకన్యల రూపాలు. వారి పేర్లతోగల స్థలాలు ఏదోఒక నీటి వనరుకు గుర్తులు. ఎండ్రికప ర్వతం, కప్పకొండ, తాబేలుగండి, మత్స్యగడ్డ మొదలైనవి.

"నీరుపుడుతుంటే లోయ – ఎండిపోతే గొంది". జీలుగుచెట్టును పోలిన కన్నెజీలుగు కన్నెదేవతలది. పెద్దజీలుగుచెట్టు "పాండవుల ఫలవృక్షం". "పాలసంద్రం, నీలసంద్రం, పాములేరు, సోకిలేరు, గోదావరికలిసివచ్చి వార్ధిపొంగినట్లు కల్లుపొంగవాలె. రౌసుకన్నెలు, మురికి కన్నెలు, ఎర్రకన్నెలు, అందరు ముట్టుదురు, అంటుదురు ఈ రోజునుండి మాది, ఇంతదాకా మీది". ఇది "చెట్టుపండుగ"లో గోదావరి, విశాఖ గిరిజనుల విన్నపం. తాటిపండ్లు, తేగలకోసం ఎదురుచూసే గిరిజనులు, తాటిముంజలు

తినరు. ముంజలు తినేస్తే ముందుముందు పండ్లు, తేగలు ఉండవుకదా? ఇలా ముందుచూపుతో ఆహారాన్ని పంటల వినియోగాన్ని "కొత్తల"ద్వారా నియంత్రిస్తూ జాగ్రత్తగా వాడుకునే శ్రద్ధ గిరిజనులది.

**గోదావరి గిరిజనుల ఋతుచక్రం :**

1. "దేశవిడిలో (జనవరి నెల) దేశమంతా పండుగ విడిపోతుంది."
2. బాడితంలో (ఫిబ్రవరి) ఆ చెట్టు (Indian coral tree)పూలు పూస్తుంది.
3. "కోరుకొండకు (మార్చి) మామిడి కోడిగుడ్డంత' – (కోరుకొండలో నరసింహస్వామి రథోత్సవం)
4. "కొత్తమాస"లో (ఏప్రిల్) "మామిడికొత్త" పండుగ
5. రోణ్డి (మే) "ఎర్రగాయ రోణ్డి" – మామిడికాయ ఎర్రబడుతుంది.
6. "దూలవిడికి (జూన్) మామిడి దులదుల రాలుతుంది."
7. "పెద్దవిడికి (జూలై) మామిడి పేరు లేకుండా పోతుంది."
8. "మునుకోలుకు (ఆగస్టు) తొలిముద్ద" (అందుతుంది).
9. "కన్నె" (సెప్టెంబర్) "కన్నెపిట్ట (Forest wagtail) దిగిందోయ్ – పప్పులుచల్లాలి" (కన్నెపిట్టతేలగానే ఊడుపులు కట్టిపెట్టి, గరువులలో పప్పులు చల్లడం ప్రారంభిస్తారు).
10. "దసరాకు (అక్టోబర్) డాకు డాకు ఇబ్బందులు – పిట్టకు బొట్టకు దీము మెర్రనికాలం."
11. "సవితికి జల్లున పంట" (నవంబరు).
12. "పలకం (డిసెంబర్) చలికూటికి బాల ఏడ్వనికాలం."

జాతి వ్యక్తిత్వంలో పరిసరం విడదీయరాని అంశం. అడవిని ఆరాధించడంతోపాటు అడవిలో అందాలను అడుగడుగునా, అణువణువునా దర్శించే రసదృష్టి గిరిజనులది. వారి పొడుపు కథలలో "అడవికి ఆటగాడు" (నెమలి), "కొండకు కోలగాడు" (కొండగొర్రె), "చేనుకు చేటుగాడు" (కుందేలు), "మెట్టకు మేలగాడు" (అడవిమేక), "దారికి దడ్డడు" (దారివెంట నడిచే బలశాలి– పెద్దపులి). "ఈ కొండకు, ఆ కొండకు ఇనుపలంకెలు" (గండుచీమలు), "ఇసుకనుమప్పినవాడు" (చెదపురుగులు), "మంచును కుంచానపట్టినవాడు" (తేనెటీగ), గోదావరి గిరిజనుల పక్షిప్రపంచంలో గుడ్లగూబ (గుంజి)రాజు, "బట్టిపిట్ట" (బింగిరాజు) మంత్రి, ఏంట్రీత పోలీసు, నెమలి నర్తకి, వడ్రంగి (డబ్బి)పిట్ట మంచిశకునం, అన్నుగోపిట్టదుశ్శకునం, తిత్రికపిట్ట మంత్రగత్తె.

**తెలుగువారి అడవుల వర్గీకరణం :**

సాధారణంగా పక్షిప్రపంచంలో గద్ద(గరుత్మంతుడు)రాజు. కాని కొండవేనం(వెన్ను)మీద వేటాడే గద్దలు కారడవులలోకి దిగలేవు. కారడవులలోని చెట్లకొమ్మలమధ్యవేటాడేవి గిద్దులు, వేటగుంజులు. ఇవి వేనంమీదికి పోలేవు. తెలుగువారు పులులుదూరని పుల్లటడవులు, కాకులుదూరని కారటడవులు ... అంటూ చెప్పుకునే నానుడులు తెలుగువారి అడవుల వర్గీకరణంగా, గిరిజనులవిజ్ఞానం బోధపడితేగాని తెలిసిరాదు.

'చీమలు దూరని (ఒల్లని) చిట్టడవులు' :

చీమలు, తీయదనం ఎక్కువగా గల పనస, మామిడి, నేరేడువంటి పండ్లచెట్లుగల ""కారడవుల"లో ఎక్కువ. అటువంటి పండ్లు అంతగాదొరకని "చిట్టడవుల"లో తక్కువ.

'కాకులు దూరని కారడవి' – అడవులలో ఉండేవి జముడుకాకులు. ఊళ్ళలో ఉండేవి ఊరకాకులు.

తీగలతో అల్లుకున్న కారడవులు 'గద్దలుదూరని గిద్దువనాలు' (గిద్దు = చెట్ల మధ్య వేటాడే పక్షి. ఓర్గంగిద్దు, కొప్పుగిద్దు, అన్నువగిద్దు, మొదలగునవి).

'గిద్దులు చేరని గద్ద వేనాలు' గద్దలు "వేనం" మీద (కొండ వెన్ను) వేటాడుతుంటాయి. వనాలలోకి దిగలేవు.

గద్దల నివాసం “వేనం” – గిద్దుల నివాసం “వనం”.

‘పులులు దూరని పుల్లటడవులు’

పిల్లిజాతికి చెందిన పులులకు, పంజాకింద మెత్తని మాంసందిండ్లు ఉంటాయి. అందువలన అవి నడిచేటప్పుడు, వేటాడేటప్పుడు అడుగులు చప్పుడుకావు. పుల్లలు, ముళ్ళున్న చోట తిరిగితే ఆ మెత్తని మాంసంలో గుచ్చుకుంటాయి. అందువలన పులి ఎప్పుడూ దారివెంటనే నడుస్తుంది.

**“కులపట్టెపట్టు, వలపట్టెపట్టు” :**

“కుండెడు కూటికిదాటగలడుగాని కులానికి దాటలేడు.”

గోమాంస నిషేధాన్ని పాటించే కొండరెడ్లకు, నిషేధంలేని కోయవారికిమధ్య వివాహాన్ని కులకట్టుబాటు అంగీకరించదు. ఈ ఉక్కుచట్రంపట్టును వర్ణిస్తున్నది ఈ కొండరెడ్ల పాట.

బందమాటి (మామిడి) బయలులోన – బయలుదేరిది గేదెపోతు

చుక్కనుదురు అలమతోక – సూటిగల్ల గేదె పోతోయా

గేదెకి వేసో బంటెవ్వడు – కారుకోడి లచ్చుమయ్య

రిప్పుమంటే తప్పేలేదొ – కన్నురెప్పలు గగ్రులు గట్టోయా

సూరుదు బాణముతోటి – చుక్కబొట్టు దెబ్బతీసో

చందురుడు బాణముతో – చెంపమీద దెబ్బతీసోయా

కండలు కాకులొల్లవు – దాని రకతము చీమలొల్లవా

చీమలు దేవిన మన్ను – చీమరాజు లేలుంబడి

నాగులు దేవిన మన్ను – నాగరాజులేలుంబడి

॥అచ్చుకోడ లయ్యోకోడ లాలచ్చీరి బాలకోడలా॥

శాకాహార జంతువులు లంకలలో–బయళ్ళలో మందలుమందలుగాతిరుగుతాయి. బాగా కొవ్వెక్కి మదించిన “గురగేదె” (అడవిగేదె–బైసన్), కణుసు, పంది ‘ఒంటి’గా తిరుగుతాయి. పులులుకూడా వాటిని ప్రత్యక్షంగా యెదుర్కొనేందుకు సాహసించవు. అట్టి ‘తారుణ్యలావణ్యజృంభిత’ యైన ‘స్వైరవిహారధీర’ను లోగొనగలిగిన బంటు కారుకోడి లచ్చుమన్న.

అతని అల్లెత్రాడు రిప్పుమంటే (ధనుష్టంకారం) గురితప్పేదిలేదు. కొట్టేది గేదెనే అయితే, అలుగును గురివైపు చెదరకుండా నడిపేందుకు కారుకోడి ఈకలను కట్టవచ్చు. కాని రూప, యౌవనసౌష్ఠవం కలిగిన నెరజాణను గెలుచుకోవడానికి కనురెప్పలనే గగ్రులుగా (ఈకలు)కట్టే ప్రేమికుడు లచ్చుమన్న. అతని ‘బారతీపు’కు (ఆకర్ణాంతం విల్లు లాగడం) దూసుకుపోయిన అమ్ము చుక్కబొట్టును ముద్దాడింది. విల్లును గుండెకు ఆనించి ‘బొక్కతీపు’తో సంధించిన చంద్రవంకలాంటి బాణం చెంపమీద గుర్తునాటింది.

కాని వారుపెట్టిన బంతికూడును కులం ఒప్పుకోలేదు. “కారుకోడి” ఇంటిపేరు వాడైన లచ్చుమన్న కొండరెడ్డి. గురగేదె వంటిది కోయపడుచు. రెడ్లకు గేదెమాంసం నిషిద్ధం. కోయలకు ఆ మాంసం చాలాయిష్టం. రెడ్లు–కోయల కులాంతర సంబంధం నేరం. దానికికులభ్రంశమేశిక్ష. అందువల్ల పప్పుకూటికోసం చేరేకాకులు, చీమలవంటి కులంవారు ఆసంబంధం ఒల్లరు. ఏజాతికాజాతికి తను దేవిన (తవ్విన) మన్నులోనే తనకు యేలుబడి, చెల్లుబాటు.

**“ఆటమనదే, పాటమనదే అన్నివిద్యలు గల్లవారము”**

సరదాలతో రెచ్చిపోయే పడుచులనుచూసి, లొట్టలేసే లేకిజనానికి, గిరిజనులు పెట్టేవాతలు, విలువలుకోల్పోయిన నాగరికతకు హెచ్చరికలు.

ఆటమనదే పాటమనదే - అన్నివిద్యలుగల్లవారము

వేటమనదే వెట్టిమనదే - వేయివిద్యలుగల్లవారము

కొలువుమనదే కొలతమనదే - కోటివిద్యలుగల్లవారము

వీట్లంకాము విద్దెలంకాము - వేడుకల బాలలము

జంగం కాదు జోగుకాదు - జోటలుండే బాలలము

అమ్మవారుయున్నప్పడు - ఆడేపాడే బాలలం

మనసుకు మంచివారము - మాపటికి దొంగవారమా


సపిరెలు తొక్కవాలె - చాపచుట్టు చుట్టువాలెయా

గుళ్లచుట్టు చుట్టవాలె - గుమ్మళ్లు ఆడవాలెయా

గుంపెనలాడవాలె - గుళ్లచుట్టు చుట్టవాలె ॥ఆడవాలె పాడవాలె - వేడుకలు సేయవాలెయా॥

(వీట్లు – వీటి మేళమువారు (బోగంవారు), విద్దెలు – ప్రదర్శనకువచ్చి డబ్బులు దండుకునేవారు. జంగం, జోగు బిచ్చమెత్తుకునేవాళ్ళు.)

మనసుమంచిది, వయసుచెడ్డది. మనిషిసమాజంలో ఒకడుగా దాని నీతినియమాలను ఆమోదించాలి. సమాజంకూడా సమష్టిహితం దెబ్బతినకుండా, మనిషి ఉత్సాహానికి దారులుకల్పించాలి. ఈ వాస్తవాన్ని ఆమోదిస్తూనే జానపదులు వ్యవస్థను గౌరవిస్తారు. వయస్సును మన్నిస్తూనే మనస్సును సరిపెట్టుకుంటారు. ఆడుతూపాడుతూ పాతనేస్తాలు చేరువౌతారు. కొత్తనేస్తాలు మనసు విప్పుకొని జతకూడి ఆలుమగలౌతారు. గిరిజనుల ఆదర్శాలు సాలప్రాంశువులుకావు– వారు మరుగుజ్జులు కారు. ముందు వెనుక ఉండే నీడవలె వారి ఆదర్శం, అంతరంగం అడుగుదూరంలోనే ఉంటాయి.




**విశాఖబయళ్లు :**

ఎటు చూసినా నాలుగువేల అడుగుల ఎత్తునగల కొండలమధ్య అడవులు, లోయలు, బయళ్లలో వాతావరణాన్ని, వనరులనుబట్టి విశాఖమన్యం గిరిజనులు ఆయాప్రాంతాలను పిలుచుకుంటారు. నేటి గూడెం, చింతపల్లిమండలాలను "చలిగూడెం పులిగూడెం" (చలిఎక్కువ, పులులు ఎక్కువ). గంగరాజుమడుగుల మండలంలోని దిగువప్రాంతం "పసిబయలు". ఇక్కడ పండే చాయపసుపు మూడేళ్లకోసారి తవ్వితీస్తారు. "వళ్లుకు వడ్డాదిపసుపుకావాలి" అని సామెత. ఈ మండలంలో కొండప్రాంతం ఆరుళ్ల (ఆరు ఊళ్ల) ఆరుళ్లవారికి "రెండాకళ్లు" అని నానుడి. రెండుపంటలు పండించే వారికి రెండు ఆకళ్ళు. పాడేరుమండలం "దోరశి", "దొంతికుండ దోరశి" కుండమీదకుండ దొంతులుగా పేర్చిన వంటకాలు. అంతా ఆహారసమృద్ధి. ఔషధద్రవ్యంగావాడే పిప్పలిమోడిని ఇక్కడ ఎక్కువ పండిస్తారు. పెదబయలు ముంచంగిపుట్టు మండలాలు "కోట్ల" "జాన్లెకోట్ల, నజాన్లె కత్రారుబంట" (తెలిసినవారికి కోట్ల, తెలియనివారికి కత్తులబాట) అని కోదుసామెత; పనుకులు, కొండలతో నిండిన ప్రదేశం. హుకుంపేట, డుంబ్రిగూడ, అరకు మండలాలు "బయలు" కొండలమధ్యపరచుకున్న బయళ్లు, లోయలు, విస్తారంగాగల ప్రాంతం. "గాళ్ళ" దిగువప్రాంతం. "గాళ్ళవారికి అన్నంమీద ఆశ ఎక్కువ" అని కొండవారి ఎత్తిపొడుపు.

ఈ ప్రాంతంలో ఎర్రమట్టికి భూగర్భశాస్త్రవేత్తలు ఇక్కడి ఆదిమతెగ (ఖోంధ్) పేరున "కోండలైట్" అని పేరుపెట్టారు. వర్షాలకు లోతైన ఈ మట్టిపెళ్లలు విరిగిపడి, కాలువల్లోకలిసి కొట్టుకుపోతుంటాయి. ఆ మట్టితోపాటు కొట్టుకువచ్చే బండరాళ్లు ఊళ్లమీద, రహదార్లమీదపడి ప్రాణనష్టం జరుగుతుంది, రాకపోకలు స్థంభించిపోతాయి. ఇలా మట్టిపెళ్లలు విరిగిపడడాన్ని (ల్యాండ్‌స్లైడ్) ఇక్కడ "ఉగంకొట్టడం" అంటారు. మద్దివలస ఉగం, బర్రెమామిడిఉగం, గాలిగుప్పఉగం, పాలకొండ ఉగం ... ఇవన్నీ ఉగాలు కొట్టిన కొండలు. "బయలు" అంటే సాపుగావున్న ప్రాంతం. ఆటబయలు, వేటబయలు, గొట్నబయలు (పశువులుకట్టే ప్రాంతం), పెద్దబయలు, చేరుబయలు, బందమామిడిబయలు మొదలైనవి ఆయా బయలు ప్రదేశాలు.

**మాయలముంత :**

గాందు, బుగ్గిమంచు, ముడిమంచు, పొగమంచువంటి రకరకాల మంచు కురిసి ఎక్కువగా చలివేసే ప్రాంతంఇదే. చుట్టూ కమ్మిన మంచులో ప్రేమికుల ఆశాభంగాన్ని బుర్రకథ వరుసలోకూర్చుకున్న పాట ఇది.

నీకు నేనుర వస్తానని – ఓ రామ ఓరామ రాఘవా

చుక్కలకుర బాసచేసిర – ఓరామ ఓరామ రాఘవా

చుక్కలకుర మొక్కుకొనిర – తందానె అయ్యోతందానె ఓ దేవనందనానా

పాపకారిర వేగుచుక్కవో – తేలకుండనే తెల్లవారెను

గాందు గాంధారి వేళలకు ఓ – ఘాటియావలె తెల్లవారెను

మాయదారిర వేగుచుక్కవో – మన్నెమివకడె తెల్లవారెను ॥

"బుడిబుడిముంత భూమేలుముంత – మధ్యమధ్యముంత మాయలదిముంత" (మంచు)

మంచులో చుట్టూ ముంతబోర్లించినట్లుంటుంది. చుట్టూ ఏం జరుగుతుంది, ఎంతపొద్దెక్కింది తెలియదు. సూర్యకాంతికి మంచువిరిగినతరువాత అంతా హడావిడి, ఆశాభంగం. చుక్కలకు మొక్కుకొని, చుక్కమీద బాసచేసి, "పొగలుబండికి పారిపోగ – పడాలు మరిదిని పిలియబోదాం" అని ఉవ్విళ్ళూరుతూ చుక్కలకోసం ఎదురుచూస్తున్న అభిసారిక, ప్రతిరాత్రీ దగాపడిపోతున్నది. వేగుచుక్క తేలినపుడు ఇల్లువదలి పారిపోదామనిచూస్తే చుట్టూ గాందు. చుట్టూకమ్మిన మంచులో చుక్కలు కనిపించవు, పొద్దు తెలియదు. మరుసటిరాత్రి, గాంధారివేళకే (రాత్రి రెండుగంటలవేళ) బయలుదేరితే కాళ్ళుకరిచే బుగ్గిమంచులో నడకసాగక ఘాటిదిగకనే తెల్లవారింది. అక్కడ జతగాడు ఎదురుచూచిచూచి, పొద్దుటినుండి కబురులేకపోగా, రాత్రిఆటకుకూడా చేరకపోయేసరికి మండిపడుతున్నాడు.

**"కొండవారిపంట – దిగువవారివంట" : "పంచపాండవులపంట – దుర్యోధనుడివంట"**

**నందిపదం :**

జోర జోర జోర – పంచ పాండవులార॥ (జోర = శరణు)

తొక్కిన భూదేవత – తోడుగాయవలె

మట్టిన భూదేవత – మనసు గాయవలె

ఎర్రబూసవల్ల – ఎలుగులెత్తవాలె

పచ్చబూసలవల్ల – పలుకు లాడవాలె

తెలిసిన నుడుగులు – తేల జెప్పవాలె (నుడుగులు = కథలు)

మరచిన నుడుగులు – మతినిగొలుపవాలె

కంచునగరి జోడు – కదలి మోగవాలె

కల్లుతాగితీమి – కమముతప్పితీమి

Ab Op univercity 17-12-10

కూడుతింటిమి – కులముతప్పితీమి

తప్పులొప్పులు మాకు – దయను జూడవాలె

విశాఖమన్యంలో గిరిజనులు వారం రోజులపాటుచేసుకునే వ్యవసాయ పండుగ “నందిపండుగ”. సారం పుంజుకోవడానికి భూమిని మూడేళ్ళువదిలేసి, మళ్లీసాగుప్రారంభించే ముందు ఈ పండుగ చేసుకుంటారు. ఆ పండుగలో పాడే నందిపదంలో మహాభారతకథను వారి కష్టనష్టాలకనువుగా మార్పు చేసుకున్నారు. ఈ కథ సారాంశం.

అంబటూలరాజు అన్నమూలదేవి భార్యాభర్తలు. అన్నమూలదేవికి కన్నెరికాన పుట్టినవాడు “పిట్టగడ్డ జలంపల్లి పట్టపుకోలన్న”. ఒకనాడు అంబటూలరాజు పోడుకొట్టి అలసిపోయి కునుకు తీస్తున్నాడు. అదేసమయంలో పార్వతీపరమేశ్వరులు అటువైపు విహారానికి వచ్చారు. వారు మోహిస్తుంటే ఏడు యోజనాలగడ్డి కదిలిపోతున్నది. ఏదోజంతువు గడ్డిలోదాగినట్లు భావించిన అంబటూలరాజు అటు దిక్కుగా మొగలిపువ్వుతుపాకి పేలుస్తాడు. తమ ఆనందాన్ని ఆటంకపరచినవాడు, పెళ్లాన్నివదలి అడవులవెంటపడి పోవాలని పార్వతి శపిస్తుంది. అంబటూలరాజు అడవిమార్గంపట్టాడు. ఆసివేయులదేశం(మన్యం)లోని ఆసివేయులపట్నంలో ఆసివేయులపాప(కొండవారి ఆడపడుచు)తో కలిసి అడవిబతుకు బతుకుతున్నాడు.

గౌరమ్మ, నందమ్మ అక్కచెల్లెళ్ళు. కొండనాయుడిదేశం (మన్యం) చూడాలని సరదాపడి బయలుదేరారు. గౌరమ్మ కొండలెక్కలేక దిగువనే ఉండిపోయింది. నందమ్మ కొండనాయుడి (అంబటూలరాజు) ఆతిథ్యానికి మురిసిపోయి అతనిమీద మనసుపడుతుంది. నీవు దిగువపిల్లవు, నిన్ను భరించే శక్తి నాకులేదని కొండనాయుడు విన్నవిస్తాడు. ‘నేను చెదలనైనవారి ఆడపడుచుగా “పుట్టకోట” (చెదపుట్ట)లో నెలవై ఉంటాను. మూడేండ్లకోసారి పండుగ చేయి’ అని సెలవిస్తుంది.

గర్భవతియైన ఆసివేయుల పాప, పాము మాంసం మీద మనసు పడుతుంది. పాము కోసం పుట్టతవ్వుతుంటే, తల్లేడు నాగు ‘పామునిస్తానుకాని మగపిల్లవాడు పుడితే పొడిచేస్తాను ఆడపిల్ల పుడితే తనకు ఇచ్చేయాల’ని షరతు పెడుతుంది. ఆసివేయులపాపకు దేవగుమ్మడిపండుపుడుతుంది. అంబటూలరాజు దాన్నిగోర్జ(దారి)లోపారేసివస్తాడు. ఆ గుమ్మడి పండును చింతగొల్ల ఏరుకొని పెళ్ళానికిస్తాడు. ఆమె గుమ్మడిపండు కోయబోతే పిల్లవాడు బయటికి వస్తాడు. అతడే సత్తెపాండవ రాజు. మగపిల్లవాడు పుట్టాడని తెలిసిన “తల్లేడునాగు” వచ్చి పాండవరాజును కాటేస్తుంది. మిందె(తొండ)గురువు, బల్లిగురువులు వచ్చి విషం తీసేస్తారు.

పాండవులు తిండికోసం నానాఅగచాట్లు పడుతుంటారు. దుగ్గబోయుడితోటలో కొమ్మరటిపండ్లు దొంగతనం చేస్తారు. ‘కీసుబాసుదేశం కిముదు నందపురం’ వెళ్ళి పశువులను ఎత్తుకొస్తారు. ఆవుమాంసం తినబోతుంటే శ్రీకృష్ణుడు అడ్డగిస్తాడు. ఆవులు కాసుకుంటూ బతుకుతుంటే ‘గారమూలకోట’ నుండి దుర్యోధనుడు వచ్చి ఆవులమందలను తరలించుకు పోతాడు. అప్పుడు జరిగిన యుద్ధంలో భీముడు చేతికందిన పశుపక్ష్యాదులను చెరో దిక్కుకు విసిరివేస్తాడు. ఎగువకు వచ్చి పడ్డవి అడవి జంతువులైనవి – దిగువకు వచ్చిపడ్డవి ఊరజంతువులైనవి.

పాండవులు వ్యవసాయం చేయడానికి నిర్ణయించుకొంటారు. కోలన్నను భీమన్నతోపాటు, విత్తనాలకోసం, అన్నమూలదేవి దగ్గరకు పంపిస్తారు. కోలన్నను కొనుక్కొని భీమన్నకు అన్నమూలదేవి విత్తనాలు కొలుస్తుంది. కాని భీముడు తెచ్చుకున్న ఆనపకాయడిప్ప ఎంతకూ నిండదు. భీముడిమాయకు కోపగించిన అన్నమూలదేవి ‘కుప్పకు చాటెడు ధాన్యంమాత్రమే అవుతుంది’ అని శపిస్తుంది. ‘పనకొక కుప్ప వెయ్యి, కుప్పకు చాటెడు ధాన్యం అవుతుంది’ అని గొంతెమ్మ, శాపానికి విరుగుడు చెపుతుంది.

ఇలా విత్తనాలు, పశువులు (నందులు) సమకూర్చుకున్న పాండవులు వ్యవసాయం ప్రారంభించేందుకు “నందిపండుగ” పెట్టుకొన్నారు. తెల్లచేపలు, తాబేలు ‘తారప్ప’ సాయంతో సముద్రాలు ఈది నాగళ్ళపురికి వెళ్ళి తాత సుంకమరాజు అనుమతి పొందుతారు. అతడు కృష్ణతామరరేకు ఇచ్చి వారిని దీవిస్తాడు. పుట్టకోటకు వెళ్ళి పుట్టమన్నుతో – సారుదుంపతో రెండు నందులను (ఎద్దులను) తయారుచేసుకొని ఊళ్ళో ‘ధమ్మం సావడి’లోకి తెస్తారు. ‘పాటపూజారి’ ‘జోరజోర జోర పంచపాండవులార’ అంటూ పాటపాడుతుంటే ‘పుట్టుపూజారి’ దేవతలకు మర్యాదలతంతు నడుపుతాడు. ‘మట్టుమలపరి’ అతనికి సహాయం చేస్తాడు. మధ్యలో ‘దొంగపూజారి’ నందమ్మను అంటే సిరిసీతపాప (నందమ్మ)ను ‘దొంగచేస్తాడు’. అతన్ని దండించి పిల్లను తీసుకొచ్చి పెళ్ళిచేసి ఆమెను పుట్టకోటకు పంపడం – పండుగలో పెద్దవేడుక.

ఎంత పండించినా – తమ పంటలన్నీ దుర్యోధనుడిరాజ్యం దిగువ ప్రాంతాలకు తరలిపోతున్నాయని, తమకేమీ దక్కడంలేదు, గిట్టుబాటుకావడంలేదంటూ ‘పంచపాండవుల పంట – దుర్యోధనుడి వంట’ అని తమ బాధను వెళ్ళగక్కుతుంటారు. వారి

దృష్టిలో పాండవులు 'ఉత్తర గో(గ్రహణం'లో విజయం సాధించారు కాని ఇంకా దుర్యోధనుడి రాజ్యం గెలవలేదు. దిగువ వారిదోపిడీయే సాగుతున్నది. పాండవరాజ్యం రానున్నదంటూ నందిపదంపాడుతూ పాటపూజారులు ఊరూరా తిరిగి గిరిజనులను తిరుగుబాటుకు (ప్రోత్సహిస్తున్నారని "గూడెం"లో రగులుకుంటున్న పితూరీగూర్చి 1870లో నాటి జిల్లాకలెక్టర్ (ప్రభుత్వానికి నివేదిక పంపారు.

ఈ పాట మన్యంలో వ్యవసాయం విస్తరించిన తీరును, సమస్యలను వివరిస్తుంది. విత్తనాలు – ఎద్దులు దిగువ నుంచే (పిట్టగడ్డ జాలంపల్లి) వచ్చాయి. అలాగే పంటలన్నీ దిగువకే వెళ్ళిపోతున్నాయి. "ఈతపండు ఇచ్చి, తాటిపండు లాగేసుకోవడం అంటే ఇదే" అంటారు గిరిజనులు.


భారతంలో కుంతికన్నెరికాన పుట్టిన కర్ణుడు దుర్యోధనుడికి అండగావుంటాడు. కాని నందిపదంలో కోలన్న పాండవులకు సాయపడుతూవుంటాడు. కోలన్న అంటే కోలగాడు (గ్రామనౌకరు / బారిక. అటు అప్పులుపెట్టే షావుకారుకు–పన్నులు వసూలుచేసే అధికారికి మధ్యవర్తి. కోలన్న "పిట్టగడ్డ" మత్స్యరాజ్యంలో ఒక (ప్రాదేశిక మండలానికి కేం(ద్రం. పిట్టగడ్డ భీమేశ్వరస్వామి, జాలంపల్లి ముప్వలమ్మ దేవాలయాలు నాటి మత్స్యరాజ్యం(వడ్డాదిమండలం)లో తీర్థస్థలాలు.

**"పల్లాన పదివేయులు – ఆరువేయుల పూరుబయలు" :**

ఓ ... ... ఎద్దుమీదర సజ్జుగట్టి – ఎక్కడెక్కడి బేరగాడు


దవ్వుకాదోయి దారకొండ – దారకొండర బేరగాడు

తూరుపున కుంచముతెచ్చి – తూలగొలచిన బేరగాడు




| అడవిజంతువులు | | ఊరజంతువులు |
|---|---|---|
| గురగేదెలు (అడవిదున్నలు) | – | గేదెలు |
| కారుకోళ్ళు | – | కోళ్ళు |
| కొండమేకలు | – | మేకలు |
| కొండగొర్రెలు | – | గొర్రెలు |
| బరవడి | – | నక్క |
| పందుపిల్లి | – | పిల్లి |
| కొండపిచ్చుక (కన్నె) | – | పిచ్చుక |
| జముడుకాకి | – | కాకి |
| కొండముచ్చు (అలమబండ) | – | కోతి |

## నందిపదంలో ప్రధానపాత్రల చుట్టరికాలు




పదమటిదిర కుంచముతెచ్చి – పారగొలిచిన బేరగాడు

చిగురులుచింతకాడ – చిత్తులాటలో పొద్దుపోయె

పొద్దుపోతెర పొయిదిగాని – పొద్దువెంటర ఎద్దుపోయె

ఎద్దుపోతెర పొయిదిగాని – ఎద్దు వెంటర సజ్జుపోయె

డబ్బుపోతెర పొయిదిగాని – డబ్బువెంటర ఇల్లెపోయె

ఇల్లుపోతె పోయిదిగాని – ఇల్లువెంటర ఇల్లాలెపోయె

మన్యంలో కుంచం – దిగువన కుంచన్నర, మణుము మణుమున్నర. ఇంకా కొక్కేలు కత్తిరించిన త్రాసులతో, మాయకుంచాలతో దారకొండ సంతకువెళ్లిన బేరగాడు బాగాగడించాడు. చిత్తులాట (పేకాట)లో మునిగిపోయాడు. పొద్దు పోయింది. పొద్దుతోపాటు ఎద్దు– సజ్జు – ఇల్లు – ఇల్లాలుకూడా పోయింది. "పల్లాన పదివేయులు" (పదివేల మాయలు) – "కొండనొక్కవేయి" (ఒకవేయి మాయలు) – "ఆరువేయుల పూరుబయలు" అంటే కొండప్రాంతాల సంతబయళ్లలో ఆరువేల మోసాలు అంటూ మోసాల శాతాన్ని తమపాటలలో విశాఖగిరిజనులు తరచు గుర్తుచేసుకుంటారు.

### మారుతున్న ఉత్పత్తి సంబంధాలు – తగవులలో పిల్లిమొగ్గలు :

ఆ పరిసరాల ఒడిలో దొర్లిపోయే కాలంలో వివిధదశలకు వాఙ్మయం, కర్మకాండ అద్దంపడతాయి. దానిలో స్పష్టాస్పష్టంగా దగ్గర దూరాలు కనిపిస్తుంటాయి. వంశచిహ్నాల(టోటెమిజం)నుండి రోజువారీతగవులు తీర్చుకోవడం వరకు ప్రకృతితో పోల్చుకుంటూ ఆపునాదులమీదనే ఆయా సంఘటనలను అన్వయించుకోవడమో, సవరించుకోవడమో సాగుతున్నపుడు, ప్రకృతితోపాటు స్పందన, దృక్పథంమారుతాయి. అనుగుణంగా అన్వయాలు, వ్యాఖ్యానాలు చోటు చేసుకుంటాయి. పాతకోట చింతలవీధి (హుకుంపేటమండలం, విశాఖజిల్లా) వాస్తవ్యుడు శ్రీకొర్రలక్ష్మన్న చెప్పినకథ మారుతున్న ఉత్పత్తి సంబంధాలకు తగినట్లు సర్దుకోవడంలో గిరిజనసమాజం పడే కుదుపులకు అద్దంపడుతుంది.

ఒక అడవిలో పెంటిపిట్ట రెండుగుడ్లు పెట్టింది. ఆ తావుకు ఇటికలపండుగకు వేటకు వచ్చినవారు అగ్గులుపెట్టారు. పోతుపిట్టవచ్చి 'మనం పారిపోదాం గుడ్లుపోతే పోయినయి, మరలపెట్టుకోవచ్చు బయలుదేరు' అని బలవంతపెడుతుంది. కాని గుడ్లను వదలిపెట్టడానికి ఆ తల్లిమనసు ఒప్పుకోదు. చేసేదిలేక పోతుపిట్ట పెంటిని వదలి ఏలంకకో పారిపోతుంది. పెంటి, దేవుడికి మొరపెట్టుకోగా అగ్గులు ఆరిపోతాయి. గుడ్లుపేలిన తరువాత పిల్లలు ఎదిగి తండ్రినిగూర్చి అడుగుతారు. 'వాడు మనను కష్టాలలో వదలి వెళ్ళిపోయాడమ్మా వాడిజోలి మనకువద్దు'అని తల్లి హెచ్చరిస్తుంది. పోతుపిట్ట వీళ్ళను వెతుక్కుంటూ వస్తుంది. 'పిల్లలునావారంటేనావారు, నాతో ఉండా లంటే నాతోఉండాలి' అని పోతు, పెంటి తగవుపడి రాజు దగ్గరకుపోతారు.

ఆ రాజుకు ఏడుగురు పెళ్ళాలు–ఏడుగురు కొడుకులు. 'పిల్లలు తల్లివే' అని తీర్పు చెపితే తనపెళ్ళాలు పిల్లలు తనను వదలిపెడితే తనకర్మ ఏమౌతేందోననే భయంతో. 'ఒక కొండన చేను నరికారనుకో! దానిలో చోడి విత్తనాలు వేస్తే చోడిచేను, జొన్నవేస్తే జొన్నచేను అంటాము. విత్తనానిదే పంట. చేసుకున్నంతకాలమే చేను. అలాగే నీవు ఏ మగనాలికో (ఇంకో మగనితో) పోతావనుకో, అపుడు ఈపిల్లలు ఈ విత్తనానివే అవుతారు'అని తీర్పు ఇస్తాడు. దుఃఖంతో ఆపెంటిపిట్ట అగ్గిలోపడి ప్రాణాలువదిలి

– ఆ ఊళ్ళో ఒక దంపతులకు కూతురు చిలకమ్మగా పుడుతుంది. ఒక్కగానొక్కపిల్ల. ప్రతివారం సంతకెళ్ళి చిరుతిండి కొనుక్కోమని తండ్రి చిలకమ్మకు డబ్బులిస్తుంటాడు. చిలకమ్మ కొనుక్కోకుండా ఆ డబ్బులు దాచుకుంటుంది.

రాజు సంతచేయడానికి డబ్బులులేక వీరింటికి అప్పుకు వస్తాడు. వారిదగ్గరా డబ్బులేదు. చిలకమ్మ తనుదాచుకున్న డబ్బు తండ్రికిచ్చి 'నాన్నా నాకో మచ్చలకోడెదూడ కొనితే' అని అడుగుతుంది. రాజు 'అటువంటి కోడె నాదగ్గరే ఉంది' అని తన కోడెను అమ్ముతాడు.


పైరురోజుల్లో ఈ కోడెలను, పెయ్యలను మేపుకు అడవికి తోలుతారు. కొన్ని నెలలయ్యాక తిరిగివచ్చినప్పుడు, మచ్చలదూడలనన్నింటినీ చిలకమ్మకట్టేసుకుంటుంది. 'ఏదో సరదాపడుతుందిలే' అని ఊరుకుంటే రోజూఅదేవరుస. ఊరిలోవారు తగవు పెడతారు. అదేరాజు తగవుకువస్తాడు. చిలకమ్మ 'విత్తనానిదే పంట అన్నావుగదా' అని పాతతీర్పు తిరగదోడుతుంది. దూడలను వదులుకోమని పెద్దలు కొత్తతీర్పుయిస్తారు. ఇలా ఎదురుచెప్పే తగవరిఉంటే తనపెద్దరికానికి భంగం కలుగుతుందని భావించిన రాజు, ఆపిల్లను పెళ్ళిచేసుకొని–ఒకమేడలో గాలి, నీరులేకుండా బంధిస్తాడు.

ఆ రాజుకు ఒక్కపెళ్ళాంకూడా వేడినీళ్ళుపెట్టి స్నానం చేయించదు. అందువల్ల వాడికి రోజూ 'పచ్చినీళ్ళ' స్నానమే. పందికొక్కును(మురుదెలుక) బతిమాలి రాజు స్నానమాడే చెరువుకు తన మేడనుండి ఒకసొరంగం తవ్వించింది చిలకమ్మ. ఒక రోజు పొద్దున మసకవెలుతురులో తామరాకుమీద కూర్చున్న చిలకమ్మను, మరొకస్త్రీగా భ్రమించి రాజు ఆమెమీద మోహంతో సమీపించబోయి నీటిలోమునిగిచస్తాడు. ఏడుగురురాణులు ఏడవడానికివస్తారు. చిలకమ్మ ఎందుకు రాలేదని ఆమెమేడకు వెళ్ళి చూస్తే, చిక్కి ఈనెపుల్లలా అయిపోయిన ఆమె, రాజుదుర్బుద్ధిని గూర్చిచెప్పడంతో కథ ముగుస్తుంది.


అడవి మానవుడి వినియోగంతో క్షీణిస్తుంది. ఉన్ననేలను బాగుచేసుకొని ఉత్పత్తి పెంచుకోవలసి వస్తుంది. దానితో ఆస్తి హక్కు ఏర్పడుతుంది. ఈ కథలో బీజప్రధానంగా నడిచే వ్యవస్థ, ప్రకృతిలో మార్పువల్ల క్షేత్రప్రధానమైనది. ఈ ఒడిదుడుకులు సర్దుకోవడానికి కొంత సమయంపట్టినా మార్పుతప్పదు. కాని నేటికీ కొన్ని భ్రమలు, ప్రమాదాలు మనను వెన్నాడుతూనే వున్నాయి.

**పోలికలు – కుతర్కాలు – మూఢనమ్మకాలు :**

చుట్టూవున్న చెట్లను పిట్టలను చూసి గిరిజనుడుపెంచుకున్న కుతర్కం మూఢనమ్మకంగా మారింది. చెట్టుమీద పిట్టలు రెట్టలు వేసినప్పుడు ఆరెట్టలోని గింజలు మొలకెత్తి పెరుగుతుంటే, ఆ మొక్కకు ఆశ్రయం యిచ్చిన చెట్టు క్రమంగా క్షీణిస్తుంది. గిరిజనుల పక్షిప్రపంచంలో ఈ తిత్రికపిట్ట మంత్రగత్తె. ఈ పిట్టవలెనే అసూయాపరులు చెడుపులు, చిల్లంగులతో తమకు గిట్టనివారి శరీరంలోకి సూదులు, ప్లాస్టిక్ముక్కలు వంటి పదార్థాలను చొప్పిస్తారని గిరిజనులు నమ్ముతారు. అనుమానం పెనుభూతమై అతడు క్రమంగా క్షీణిస్తాడు. ఇటువంటి రోగాలను నయం చేయడానికి వెజ్జులు, జన్నోళ్లను ఆశ్రయిస్తారు. వాళ్లు శరీరంలోనుండి ఈ వస్తువులుతీసినట్లు ఏదో తంతుచేస్తూ అభినయిస్తారు. నందిపండుగలో ఈ వెజ్జులు, శివాచార్లు, అసూయాపరులు



భూమిలోపెట్టిన "తాపడాలు" పెరికితీయడం పెద్దతంతు. ఇటువంటి నమ్మకాలు గిరిజనులకే పరిమితం కాదు మొత్తం మానవజాతిని పట్టిపీడిస్తున్నాయి. ప్రకృతికి, సంస్కృతికి మధ్య వావివరుసలు, ఈడూజోడు, మంచిచెడ్డలతో సరిహద్దుగీసిన మానవసమాజం ఇంకా ఇటువంటి భ్రమప్రమాదాలనుండి బయటపడలేదు.




### మీలాటి కాలమురాగ – మిమ్ము తలచి పాడుతాము :

వర్ణధర్మాల ఉక్కుచట్రంసడలి, పాలకుల ఐశ్వర్యం – ఆశ్రితుల నైపుణ్యం, బగతల నాయకత్వం, కొండదొరల కష్టజీవితం, మాలల లోకజ్ఞత, కమ్మరులపనితనం వియ్యమంది ఈ అంతరాలు చెరిగిపోయి, ఎల్లలోకము ఒక్కయిల్లు కావలెనని, నిలచిన నింగిదేవతను – తొక్కిన భూదేవతను, ఆనీడలు తోడులివ్వమంటూ పొలాలుఊడ్చే పడతులు మాలగంగు, సంజీవ రాజులపెండ్లిపదంలో కోరుకుంటున్నారు.

శరణుశరణు దుర్గాండ్లమ్మలు – మీ చరణాలు తప్పలేను

మీచరణాలుతప్పినగాని – తుమ్మెదీరో – మీ కరుణాలు తప్పలేను
మీలాంటి కాలమురాగ – తుమ్మెదీరో – మిమ్ము తలచి పాడుతాము
ఇంటి ఇలవేలుపులార – తుమ్మెదీరో – మాయందున సాయముండుదు
శరణుబాబు దేశిరాజులు – తుమ్మెదీరో – శరణుబాబు సంజీవరాజు
శరణుగాద గంగుగార – తుమ్మెదీరో – శరణుబాబు సంజీవరాజు
ఓ... మరచిన నుడుగులు బాబు – మతియందు గొలుపవాలె
తెలియని నుడుగులుబాబు – మాకుతెలియచెప్పవాలె
తప్పపాడెము తగులపాడెము – తుమ్మెదీరో – కోపచింతలొద్దుబాబు
మామీద దయలుంచుడు – తుమ్మెదీరో – మామీద సాయముంచుడు
నల్లపూస కొడివల్లన – తుమ్మెదీరో – నారు నాకు నడియవాలె
పచ్చపూస కొడివలన – తుమ్మెదీరో – పదము నాకు నడియవాలె
ఎర్రపూస కొడివలన – తుమ్మెదీరో – ఎలుగు నాకు నడియవాలె
శరణుబాబు మాకలిశక్తి – తుమ్మెదీరో – నందపురమున వెలిసియున్నది
శరణుబాబు దేబాలమ్మలు – తుమ్మెదీరో – మీ చరణాలు తప్పలేము
ఓ... చదువు సాములు లేనివారము – తుమ్మెదీరో – ఇటింపండుగ చేసుతాము
మసిరుసి బట్టలతోను – తుమ్మెదీరో – మిమ్ముతలచి పాడుతాము

Ab Op univercity 17-12-10


ఎనలవారు జతలవారు – తుమ్మెదీరో – మీకు దండము తల్లులార తుమ్మెదీరో

విశాఖమన్యంలో గిరిజనస్త్రీలు ఊడుపులప్పుడు పాడుకునే ఈ మోదకొండమ్మ తుమ్మెదపదం వారి ఆదర్శాలను – నందిపండుగ పదం వారి ఆక్రోశాన్ని చిత్రిస్తాయి. నందపురం (ఒరిస్సా. జైపూర్), మాడుగుల, వఁజగడ, గొలుగొండ సంస్థానాల వియ్యాలు – కయ్యాలకు, తమ ఆకాంక్షలను కూడా జోడిస్తూ, సృజనాత్మక ధోరణిలో ఆదర్శవంతమైన రూపమిచ్చిన ఈ మోదమ్మ లేదా మాలగంగుపదం గేయరూపంలో పొదిగిన ఒక కైఫియతు. 'మన్నెయింటి రాజయినా – మాలయింటి పడుచు గంగుగారిని మోదకొండమ్మ కొడుకు సంజీవరాజు పెండ్లాడిన కథ 'మాలగంగు పదం' పాతపాడేరులో 'మాలగంగుమెట్ట', 'గంగుగారిపాదాలు' ఉన్నాయి. మోదకొండమ్మ విశాఖ గిరిజనులకే కాదు, గ్రామీణులకుకూడా ఇలవేల్పు. మోదమ్మ, ఆమెచెల్లెళ్ళు ఆరుగురు దుర్గాండ్లు దిగువరాజు దేవేంద్రుని కూతుళ్ళు. దేవేంద్రుని భార్య రాచగన్నియ కొండవారి ఆడపడుచు. దేవేంద్రుని చెల్లెలు దేవేంద్రాలు కొండవారికోడలు. దేశిరాజులు (మన్యం రాకుమారులు) – వారి మేనమరదళ్ళు దుర్గాండ్లు, గాంధర్వ వివాహమాడిన బయలు 'కల్యాణపులోవ' నేడు ఆ పేరుగల రిజర్వాయర్.


ఉజ్జయిని పాలించిన చంద్రగుప్త విక్రమాదిత్యుడు తన కుమార్తె ప్రభావతీదేవిని నందపురం రాజవంశీయులకిచ్చి పెళ్లిచేశాడు. పర్వతప్రాంతాలవారైన నందవంశరాజులు– దిగువప్రాంతాలను వడ్డాదిరాజధానిగా పాలిస్తున్న మత్స్యరాజుల మధ్య వివాహసంబంధాలు కొనసాగుతున్నాయి. కానీ దిగువరాజులకు కొండవారంటే చిన్నచూపే. "తీపలులాగడం" (గాంధర్వవివాహం) గిరిజన సంప్రదాయం. దిగువవారికది "దొంగపెండ్లి". తనకూతుళ్లు దుర్గాండ్లను గాంధర్వవివాహం చేసుకున్న తనమేనల్లుళ్లు దేశిరాజులకు దిగువరాజు దేవేంద్రుడు సంకెళ్లువేసి జైలులోపెట్టి శిక్షవిధిస్తాడు. తప్పు, వెలి తప్ప ఇటువంటి శిక్షలెరుగని దేశిరాజులు ఈ శిక్షను ఒక అవమానంగా భావించి ఆత్మహత్యచేసుకుంటారు.

దుర్గాండ్లలో పెద్దది మోదకొండమ్మ అప్పటికే గర్భవతి. ఆమె కొడుకు సంజీవరాజు కొండ, దిగువరాజ్యాలకు ఏకైకవారసుడు. అతడు వేటమార్గాన పోతూ "ఆలపాటలు పాడుతూ, అడవిరొడ్డలేరుతున్న" మాలగంగును చూసిమనసుపడ్డాడు. అంటరానికులంతో సంబంధం, కులకట్టుబాటును పాటించే గిరిజన సమాజం మన్నించదు. కానీ, శిక్షవిధిస్తే చిన్నబుచ్చుకుని కొడుకు ఏ అఘాయిత్యానికి పాల్పడతాడో అని మధనపడుతూ, దుర్గాండ్లు నందపురంలోగల పెద్దదుర్గ మాకలిశక్తికి కబురుపంపుతారు. ఆమె మాలగంగు మర్యాద మన్ననలనుమెచ్చుకుని సంజీవరాజుకిచ్చి "గౌరవంగా పెళ్లి"చేసి, మాలగంగును పట్టపురాణిని చేస్తుంది. కులాంతర సంబంధాలను వెలివేసే కొండవారి కట్టుబాట్లను, ఉంపుడుగత్తెగాచేసుకునే దిగువవారి వక్రమార్గాలను తోసిరాజని 'మాలగంగు పదం' మరోఆదర్శసమాజాన్ని మనముందు వుంచుతున్నది.

**కొండవారి-దిగువవారి దృక్పధాలు**



**కొండరాజుల - దిగువరాజుల చుట్టరికాలు**




## తెలుగు సంస్కృతిలో గి

తెలుగుసంస్కృతిలో రాజకియాలకు, మతానికే కాదు, తెలుగుల ఆచారాలకుకూడా గిరిజనసంస్కృతి భూమిక. ఆచారాలు, పండుగలు, వలసలవలన తెలియవచ్చే చరిత్రే సంస్కృతి.

**మామిడి కొత్త - తెలుగువారి ఉగాది :**

ఉగాది, సంక్రాంతి ఋతుధర్మం మీద ఆ ...ందె పడుతున్న సందర్భంగా మనంచేసుకునే ఉగాది, 'మామిడికొత్త'గా మన్యాన ఎంతో ప్రసిద్ధ ...డి)పొలంలో అయినవారందరూ తిని మిగిలిన మాంసాన్ని పూడ్చిపెట్టడం రాజులపండుగ ~~పరిణామమే. పో~~[redacted]~~వసాయం చేసే~~ కొండరెడ్లు కొండలకు (నగరి) మ్రొక్కి అక్కడే ఆ పండుగ తీర్చుకుంటారు. విశాఖమన్యంలో కొత్తలుకలపడాన్ని "వెన్నులుముంపడం" అంటారు. వరికంకులను ఇంటివసారాలలో కట్టడం జానపదుల అలవాటు. పచ్చిపండు విభాగాలు, పండుగ చేయడం జానపదులలోనూ ఉన్నవే.

పురిటాలు రేవుకుమొక్కడం 'కప్పతల్లి నీళ్ళాడె' అని పిల్లలు ఊరేగడం తెలిసినవే. అనేకవిధాల గిరిజనులు ప్రస్తుతించే ఈ జలకన్యకలపాత్ర తెలుగుసంస్కృతిలో ప్రముఖమైనది.

తెలుగుదేశపు వాతావరణంలో, పరిసరంలో ప్రకృతి సంపదలో ఎంతో వైవిధ్య మున్నది. దీనిని ఎక్కడికక్కడ సమగ్రంగా వినియోగించుకోగల ప్రతిభ సాధనసంపత్తితో మనసంస్కృతి వర్ధిల్లింది. ఆయాప్రాంతాలలో తెగలందరు తమ పరిసరానికి తగిన విశిష్ట జీవనవిధానంతో విజ్ఞానంతో స్వతంత్రులుగా చిరకాలంగా జీవిస్తున్నారు. తొలిగా అనువదింపబడిన భారతీయగ్రంధం పంచతంత్రమట. ప్రతిగిరిజనుడు ఎన్నో పంచ తంత్రాలు చెప్పగలడు. ప్రతికథ పరిసరవిశేషాలకు మనోజ్ఞమైన కరదీపిక. జానపద జీవితం వ్యవసాయంచుట్టూ పరిభ్రమించేదికాగా ఈ తెగల జీవితాలకు అడవిఆధారం. జానపదుల సామెతలలో మిగిలిన, పలకంనెల (పలకమ్మకు పడమటి కొమ్మైనా పూస్తుంది), ఈ ఋతుచక్రమంతా గిరిజనులకు తెలిసినదే. 'ఊటనేల దుక్కికిరాదు'. 'ఊటనేలలో ఊడుపులు ఉద్ధరించినట్లు', ఈ జానపదుల అనుభవాలన్నీ 'ఎండ్రిక నీళ్ళు'గా విశాఖ గిరిజనులకు, 'రెల్లపూచినట్లు' అనే పోలికలు 'రెల్లపూల గాలిరాగా రేగిపోదామన్న మనసు' అని పాడుకునే గోదావరి గిరిజనులకు సమగ్రంగా తెలిసినవే.

నేటితెలుగువారి దరువులు (లయ), ఛందస్సు, విచిత్ర వేషాలు, నాట్య విశేషాలు (ఆట) ఇవన్నీ ఈ తెగల జంపె, త్రిపుట, అటతాళం, ఏకతాళం, కురుచజంపె, శోభనాలు ఆధారంగా మొగ్గ తొడిగినవే. నేటి బుర్రకథ, హరికథ, గొల్లకలాపం, జక్కులవారి పాటలు ఈ కళలను ఆధారం చేసుకుని అభివృద్ధి చెంది రాణిస్తున్నాయి. ఎరుకలవారి కొరవంజిఆట ప్రసిద్ధిని, తంజావూరు నాయక రాజుల కొలువులో కవులు ప్రస్తావించారు. కురవంజి తమిళనాట విస్తృతంగా ప్రచారంలో వుంది. సిక్కు, గూర్ఖా, మరాఠా, రాజ పుత్రులు మొదలుగాగల జాతులయుద్ధకౌశలాన్ని గౌరవిస్తున్నట్లే, భూగోళ, జంతు, వృక్ష, మత్స్య, పక్షి, సర్పశాస్త్రాదులు తెలిసిన మన తెగల వారసత్వాన్ని ఆదరించాలి. మన తెగలతో ఆయావైజ్ఞానికబృందాలను తయారుచేయాలి. ఆ ప్రాంతపు కళాశాలలో ఈ జాతుల, కళల, శాస్త్రచరిత్రల అధ్యయనాన్ని ప్రోత్సహించి, ఈ తెగలపట్ల 'గౌరవం' పెంచాలి. దేశీయవిజ్ఞానం నిగ్గుతేలాలంటే శాస్త్రచరిత్రను గిరిజనులనుండి పరిశోధించుకుంటూ రావాలి. గిరిజనుల్లో పెరుగుతున్న 'ఆత్మన్యూనత' వదిలించాలి.

## సంప్రదాయం - తిరుగుబాటు : గుణపాఠాలు :

విలక్షణమైన భౌగోళిక ప్రాంతాలు, ఉత్పత్తి విధానాలు, విభిన్నమైన ప్రమాణాలు, దృక్పథాలు, జీవనమూల్యాలతో ఎదుగుతున్న

సమాజాలు ఎదురుపడినప్పుడు తలెత్తుతున్న సమస్యలు అనేక రూపాలలో చిరకాలంనుండి మనకు కనిపిస్తున్నాయి, వినవస్తున్నాయి. ఈ ఘర్షణలు విధ్వంసానికి దారితీసినట్లు సవరల ముఖలింగం శిల్పకథ తెలియజేస్తున్నది. ఆంధ్రప్రదేశ్ మధ్యగల నల్లమలఅడవులు ఆ చుట్టుప్రక్కజిల్లాలకు "తృణకాష్ఠ జలసమృద్ధి"ని సమకూర్చే సహజ సంపద. పొదుగుకోసి పాలుతాగినట్లు అందరంకలిసి నల్లమలఅడవులను నాశనం చేసినందున చెంచుల ఆహారభద్రతకు భంగంకలగడమేకాదు, పరిసరప్రాంతాలు ఎడారిగా మారిపోతున్నాయి. నల్లమలనుకాపాడే ఆత్మవిశ్వాసం, అండదండలు చెంచులకు అందించడం మనందరి బాధ్యత. కోయవీరులు ప్రతాపరుద్రుని ఎదిరించినట్లుగా ప్రచారంలోగల సారలమ్మ –సమ్మక్కల (మేడారం జాతర) చరిత్ర పురాగాథ రూపంపొందిన సీతాపతిరాజు చరిత్రకావచ్చు.

చదువు సంధ్యలలో ముందంజవేసిన సమాజం తమనువంచించినందుకు బాధపడిన సవరలు, చదువుసాములు నేర్చుకోవడం మొదలుపెట్టారు. దానిని ఒకపూజాపద్ధతిగా కొనసాగిస్తున్నారు కాని, తాముకోల్పోయిన జగన్నాథుడి రూపమయిన అడవి, భూమి, నీరు మొదలైన సహజవనరులను తిరిగి సంపాదించుకోవడమే చదువులలక్ష్యంఅని గ్రహించలేకపోతున్నారు. చైతన్యవంతులను చేయడానికి ఉద్దేశించిన ఉద్యమసాహిత్యం గిరిజనులలో న్యూనతాభావాన్ని పెంచి వారిని పరాధీనులను చేసింది.

**విధ్వంసం :**

కళింగరాజ్యానికి శ్రీకాకుళం జిల్లాలోని శ్రీముఖలింగం రాజధాని. నగరికటకం స్కంధావారం, కళింగపట్నం ఓడరేవు. శ్రీముఖలింగక్షేత్రంలో మధుకేశ్వరస్వామి అవతరించినతీరును ఆ దేవాలయంలో శిల్పాలు వివరిస్తాయి.

సవరరాజుకూతురు రోజూ ఇప్పపూల(మధుక)తో శివలింగాన్ని పూజించేది. కాశీకివెళ్ళే ఒక బ్రాహ్మణ కుటుంబం మార్గమధ్యాన ముఖలింగంలో మకాం చేసింది. ఆ బ్రాహ్మణునికూతురుకూడా ఇప్పపూలు ఏరి శివుడికి అర్పించేది. సవరకన్య పెట్టినపూలు వాడిపోగా, బ్రాహ్మణకన్య పెట్టినవి బంగారుపూలుగా మారిపోతుండేది. ఈ మాయకు కారణమేమిటని సవరలు శివలింగాన్ని నిలదీశారు. ఆయన ఉలకలేదు, పలకలేదు. ఈ మాయలకు తగాదాలకు కారణమైన ఇప్పచెట్టును సవరరాజు నరికివేశాడు. ఆ చెట్టుమొద్దు (శిలాజం) లింగంగామారి మధుకేశ్వరుడుగా పూజలందుకుంటున్నది.

**అభయారణ్యం :**

చెంచు అడవిఅంతా గాలిస్తాడు. ఏదోవిధంగా పొట్ట నింపుకుంటాడు. అతనికి నచ్చని తిండిలేదు. వారి ఆడపడుచు చెంచులక్ష్మిని వైకుంఠానికి తీసికెళ్ళినప్పుడు నరసింహస్వామి 'బంతి'పెట్టాడట. చెంచుపెద్దలుకూడా వచ్చారు. ఇంతలో ఒకఉడుము బంతిమధ్యలోంచి పారిపోతూ చెంచులకంటపడింది. విస్తళ్ళలో భోజనం వదిలేసి చెంచులు దానివెంటబడ్డారు. ఈ ప్రవర్తనకు చెంచులక్ష్మి ఖిన్నురాలైంది. తనవాళ్ళకు అందరివలె మంచిభోజనంతినే అదృష్టం రాసిపెట్టలేదా – అని బాధ పడుతుంది. చెంచు ఆకలితో ఉండడు. అడవిలో అతనికి ఏదో ఒకటి దొరుకుతుంది. అతడు పస్తులుండడు అని చెంచులక్ష్మిని నరసింహస్వామి ఓదారుస్తాడు. అభయమిస్తాడు.

కాని ఐదుజిల్లాలమధ్య అడవి. చుట్టూవేలాది గ్రామాలు ఈఅడవిమీద ఆధారపడి ఉన్నాయి. వీరందరూ 'కనుమకావలి', 'గొల్లలమామూలు', 'దొడ్డిబత్తెం', మిరాసి మామూలు' ఇలా రకరకాలైన మామూళ్ళు అలవాటుచేసి దొంగదారులు తెరచి, అడవినంతా గుల్లచేశారు. శ్రీశైలం, జలవిద్యుత్ కేంద్రాలకు వెళ్ళడానికి రోడ్డువేయడంతో చెంచులకు యాత్రికులను నడకదారిన తీసుకుపోయే ఆధారంపోయింది. 1978లో పులుల అభయారణ్యంగా ప్రకటించినంతమేర వెదురునరుకు కూలీపనిలేకుండా పోయింది. క్షయవ్యాధితో ఆకలిచావులతో అంతరిస్తున్న 74 తెగలలో ఒకటిగా చెంచులను 1994లో భారత ప్రభుత్వం ప్రకటించింది. నల్లమల తీవ్రవాదుల–ప్రభుత్వ బలగాల రణరంగంగా మారింది.

**పురాగాథగా మారిన చరిత్ర :**

కాకతీయులసేనాపతుల్లో, 12 వేల విలుకాండ్ల దళానికి నాయకుడు కోయతెగకు చెందిన సీతాపతిరాజు. మహమ్మదీయులు కాకతీయులను ఓడించినపుడు శితాబ్‌ఖాన్‌గా అతనిపేరుమార్చారు. "జీర్ణకాకతీయ రాజ్యస్థాపనాచార్య" బిరుదాంకితుడైన సీతాపతిరాజు ఓరుగల్లు, ఖమ్మంమెట్, బెల్లంకొండదుర్గాలను వశంచేసుకుని గోల్కొండరాజులకు పక్కలోబల్లెంగా మారాడు. సుల్తాన్ కులీకుతుబ్‌షా బెల్లంకొండ ఖమ్మంమెట్‌దుర్గాలను దిగ్బంధంచేసి అపారనష్టానికోర్చి చివరకుఅక్కడి సంపదను తరలించుకుపోయాడు.

కాకతీయులు బస్తర్‌మీద దండయాత్ర చేసినపుడు కోయలతోఘర్షణతప్పనిసరై వుంటుంది. ఈ సంఘటనలనే జంపన, పగిడిద్దరాజులు ప్రతాపరుద్రునితో తలపడి, వీరమరణం పొందినట్లు వారి రాణివాసం సహగమనం చేసినట్లు, మేదారం–సమ్మక్కజాతర పురాగాథగా ప్రచారమవుతుంది.

**పునరుజ్జీవనం :**

పూరీజగన్నాథుడు సవరల దేవుడు. ఈనాడు పూరీ జగన్నాథ దేవాలయం వున్న ప్రాంతం ఒకప్పుడు పెద్దఅడవి. పూరీరాజులు వేటకు వచ్చినప్పుడల్లా సవరల సాయం తీసుకునేవారు. తమ సైనికులంతా సాయంత్రానికల్లా ఉసూరుమని తిరిగివస్తుంటే సవరలు మాత్రం పగలంతా వేటలో పాల్గొని సాయంత్రం మళ్లీ ఆటపాటలతో సరదా చేసుకుని పొద్దున్నే రాజుతో వేటకు తయారయ్యేవారు. తాము వేటాడిన దాంట్లో రాజుకు, ఆయన పరివారానికి కొంత బహుమతిగా పంపించేవారు. సవరల ఉత్సాహానికి, వాళ్ళ అదృష్టానికి రాజుకు ఆశ్చర్యంతో పాటు అసూయ కలిగింది. దీంట్లో రహస్యమేమిటో తెలుసుకోమని పురోహితుడు విద్యాపతిని పంపించాడు. అతడివల్లకాలేదు. చివరకు అతడు ఒక సవర యువతిని ప్రేమలో పడేశాడు. సవరలు దేవతలకు మొక్కే మంత్రాలన్నీ ఆమె నుండి నేర్చుకున్నాడు. వాటితో తనసేవలతో దేవుడిని తనవశం చేసుకున్నాడు. తాము పిలిస్తే పలికే దేవుడు, తమ పట్ల అశ్రద్ధగా వుండడం గమనించిన సవరలు దేవుణ్ణి నిలదీస్తారు. పురోహితుడు చదువుకున్నవాడని, మంత్రాలన్నీ తనకు, రాజుకు అనువుగా మార్చుకుని తనను వశం చేసుకున్నాడని జగన్నాథుడు సంజాషీ యిచ్చుకుంటాడు. సవరలు దేవుడిని వదిలేది లేదని పట్టుపడతారు. తాను అక్షరబ్రహ్మగా మళ్లీ సవరదేశంలో అవతరిస్తానని, తనను చదువుసంధ్యలతో ఆరాధించాలని జగన్నాథుడు వారిని ఓదార్చుతాడు. అక్షరబ్రహ్మను ఆరాధించే శుద్ధసవరలు మునిగూడ, రాయగడ, శ్రీకాకుళం ప్రాంతాల్లో వున్నారు. మంగయ్యసవర సవరభాషకు నిఘంటువు రాశారు. ఈ శుద్ధసవరలు స్వంతంగా పాఠశాలలు పెట్టుకుని చదువుతో అక్షరబ్రహ్మను ఆరాధిస్తున్నారు. గిరిజనులకు వారి మాతృభాషలో విద్యాబోధన అవసరాన్ని గుర్తించిన గిడుగువేంకటరామమూర్తి పంతులుగారు సవరభాషలో వాచకాలు తయారుచేశారు.

**ఉద్యమ సాహిత్యం :**

"ఈ (శ్రీకాకుళ) ఉద్యమకార్యకర్తలు, గిరిజనుల సాంస్కృతిక జీవితంగూర్చి తెలుసుకోకపోవడంతో వారిని కదిలించగల మౌఖిక సాహితీ ప్రక్రియలగూర్చి తెలవకుండాపోయింది. గిరిజనులు ఆశువుగా పాడుకునే పాటలస్థానంలో, కవుల లిఖితశైలి, వారికి పరిచయం లేని బాణీలు, వారిది కాని భాష, ఉద్యమవస్తువుతో పాటలు రాయడానికి గిరిజన రైతాంగాన్ని పురికొల్పలేదు. కార్యకర్తలు పాటలను సవరభాషలోకి అనువదించినా, వాటి లిఖితశైలి, భిన్నఅభివ్యక్తి నిర్మాణాలవల్ల వాటిని అదేరీతిలో తమ అనుభవాలను కవితాబద్ధం చేయడానికి గిరిజనప్రజలు పూనుకోలేదు.

కార్యకర్తల ప్రచారలక్ష్యం నెరవేరినా ప్రజలు తమ అనుభవాలను కవితాబద్ధం చేయడానికి, వారు కార్యకర్తలు విన్పించిన పాటలను ఆదర్శంగా భావించడంతో, ఆ స్థాయిలో రాసినవే పాటలనీ, తాము ఆ స్థాయిలో రాయలేమని భావించడంతోకూడా వారు తమ అనుభవాలకు పాటరూపాన్ని ఇవ్వలేకపోయారు. ఈ పాటలువారి స్వేచ్ఛావ్యక్తీకరణకు ఆటంకాలయినాయి. ఇలా లిఖితశైలి రచనలు ఆదర్శంకావడం, మౌఖిక సంప్రదాయంలోని కార్యకర్తల స్వేచ్ఛావ్యక్తీకరణకు ఆటంకంకావడం అనేవి ఈ దశలో (లిఖితశైలి ఫలితంగా) విస్తృతంగా పాటలురాకపోవడానికి ముఖ్య కారణాలు.

గిరిజన సంస్కృతిలోని సంప్రదాయాలు, నేస్తం కట్టడం మొదలైనవాటిని స్వీకరించి తమ దృక్పథానికనువుగా మలచుకోవడం ఏజన్సీ గిరిజనోద్యమం మొదటిదశలో సాగింది. ఆ తరువాత మైదానప్రాంత జీవితవాస్తవికతను చిత్రించే ఆప్రాంత ప్రజలసంస్కృతిలో భాగమైన నాటకాలను ఏజెన్సీలో ప్రదర్శించడమేకాని గిరిజనసంస్కృతిలోని దృశ్యకళారూపాలను స్వీకరించలేదు, ప్రదర్శించలేదు" అని పరిశోధకులు విమర్శించారు.

## వనరులు – విజ్ఞానం – హక్కులు :

అడవులు, నీటివనరులు, బీళ్ళు, ఈ వనరుల మీద బతుకుతున్న జాతుల, తెగల అలిఖిత విజ్ఞానం సంగ్రహించడానికి ఈవేళ అంతర్జాతీయ విపణి ఆరాటపడుతోంది. ఈ జాతుల సంప్రదాయ విజ్ఞానంమీద హక్కులు తమవేనని ప్రపంచవాణిజ్య సంస్థ సమావేశాలలో బడుగుదేశాల ప్రభుత్వాలు వాదిస్తున్నాయి. ఈ జ్ఞానం స్వంతం చేసుకోవడం కోసం అందరూ ఈ జాతుల వెంటపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ జాతులకు – జాతీయజీవనస్రవంతికిమధ్య అంతరిస్తున్న సామరస్యం పెంచడం సమాజం ముందున్న సవాలు. అందుకు ముందు మనదృక్పథంలో మార్పురావాలి. గిరిజనులను అర్థం చేసుకోవడానికి మరింత అధ్యయనం జరగాలి.

ఈ తెగల కళాత్మకమైన సారస్వతం, ఎనిమిది కోట్ల తెలుగు ప్రజలకు, ప్రపంచానికి జ్ఞానభిక్ష పెడుతుంది. ఎదిగేతరంలో వారి ఆటపాటలు మనోవికాసాన్ని, ఈ అడవులలో పర్యటన ధైర్యసాహసాలను, ఈ జాతుల గూర్చిన సదవగాహన మానవత్వపు విలువలను పెంచుతుంది.

## చదువదగిన పుస్తకాలు :


– కొండకోనల్లో తెలుగు గిరిజనులు – పి. శివరామకృష్ణ

– సీతాపతిరాజు – ఆదిరాజు వీరభద్రరావు

– విశాఖజిల్లా గెజిటీర్ 1869 – విజాపురపు వెంకట్రామయ్య

– కళింగ సంచిక – సం. రాళ్లబండి సుబ్బారావు

– జానపదగేయాలు – సాంఘిక చరిత్ర – బి. రామరాజు, నాయని కృష్ణకుమారి

– బుడగ జంగాలు – వెంకటేశ్

– పద్మనాభ యుద్ధం – తెలుగుఅకాడమీ

– వడ్డాది మత్స్యరాజుల వంశావలి – సింహాచలం

– శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం – కె.ముత్యం

- Glimpses into Telugu Folklore - B. Rama Raju
- The Reddies of Bison hills - Haimendorf
- The Chenchies of Hyderabad - Haimendorf
- The Moral and Merit - Haimendorf
- A manual of Kistna District 1883
- Tribal India - G.S. Gisbert
- Current Trends in folklore studies - Jawaharlala Handoo
- Report on Socio Economic Conditions of Aborigional tribes of the provincess of Madras - Aiyappan
- Our creative diversity - Report of the World Commission on Culture and Development1996
- Geographical Data in early Puranas - M.R. Singh
- Mukhalingam - A Monograph, Archaelogy Dept. Govt of A.P.
- Ahobilam - A Monograph, Archaelogy Dept. Govt of A.P.
- India - A regional Geography - Ed. R.L. Singh
- History of the cult of Narasimha in A.P. - Madabhushi Narasimhacharya
- Tribes of Andhra Pradesh - D.R. Pratap
- The Bagathas and related Tribes - A. Munirathnam Reddy
- Illusion and realiy - Christopher Caudwell
- Studies in the history of Vijayanagar - N. Venkatramaiah
- Tribal cohesion - Urmila Pingale
- The Littel Community - Peasant Socitey & Culture - Robert Redfield
- Subaltern Studies - I - Ranajith Guha
- The Koyas of Andhra Pradesh - K. Mohan Rao
- Studies in Ecoclimatology of A.P. - Hemamalini
- The Savage Mind - Claude - E - Levistrauss
- The Early History of Deccan Yazdani, Gen. Editor Part VII-XI.